
మార్కాపురంలో రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా...

రోడ్లు, పారిశుధ్యం అధ్వానం

అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు వర్షాలతో మరింత దారుణంగా మారాయి. గ్రామాలు, పట్టణాల్లోని అంతర్గత రోడ్లు చాలాచోట్ల జలమయమై కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులపై ఇప్పటికే పెద్ద గుంతలు పడి వాటిలో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల అర్ధగంట ప్రయాణానికి గంటన్నర పడుతోంది. అదేసమయంలో పట్టణం పల్లె అన్న తేడా లేకుండా పారిశుధ్యం పరిస్థితి దారుణంగా మారింది. పట్టణాలలో ఆక్రమణలు అధికమై మురుగు అంతా రోడ్లపైకి చేరింది. పల్లెల్లో రోడ్లు, కాలువలు ఏకమై నీరుపారి దుర్గంధం వెదజల్లుతోంది. తక్షణం అధికార యంత్రాంగం పారిశుధ్యం మెరుగుపరచకపోతే వ్యాధులు ప్రబలే ప్రమాదముంది.

జిల్లాలో పది రోజులుగా కురిసిన వర్షాలు తెరిపిచ్చాయి. అక్కడక్కడా ఒకట్రెండు ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల ఆదివారం ఎండ కాచింది. దీంతో పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు అంచనా వేసిన దాని కన్నా నష్టాలు అధికంగా ఉండే పరిస్థితి కనిపిస్తోంది. మళ్లీ వానలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనతో రైతులు వణికిపోతున్నారు. మరోవైపు వర్షాలకు అత్యధిక ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రమయ్యాయి. గోతుల్లో నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా మారింది.


వర్షానికి తడిచి బూజు పట్టిన పత్తి కాయ

అపార నష్టం

తెరిపిచ్చిన వర్షం • ఉరకెత్తుతున్న పంటలు


తాళ్లూరులో దెబ్బ తిన్న పంటపొలాలను శనివారం పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

- వాయుగుండం అనంతర పరిస్థితితో రైతుల్లో ఆందోళన
- మళ్లీ వర్ష సూచనతో వణుకు
- చాలాప్రాంతాల్లో అధ్వానంగా రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- సాధారణ స్థితికి జనజీవనం
- పారిశుధ్యంపై దృష్టి పెట్టకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం

ఒంగోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వర్షం తెరిపి ఇచ్చి ఎండ రావడంతో పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా సజ్జ, మినుము, కంది, పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలు వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. 26 మండలాల్లోని 119 గ్రామాల్లో 7,241 మంది రైతులకు చెందిన సుమారు 7,194.47 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే ప్రస్తుతం ఎండ కాస్తుండటంతో నష్టాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. పది రోజులుగా నీళ్లలో ఉన్న పంటలు ఉరకెత్తిపోతున్నాయి. పశ్చిమప్రాంతంలో పొగాకు, మిర్చి, పత్తి, కంది పంటలు దెబ్బతింటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం దాదాపు పదిహేను వేల హెక్టార్లకుపైగా పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

వాగులు, వంకల్లో జలకళ

జిల్లాలో చాలాకాలం తర్వాత వాగులు, వంకలు చిన్న, పెద్ద చెరువులు, కాలువలు ఇతరత్రా అన్ని నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఈ సీజన్ అవసరాలకు నీటి ఇక్కట్లు ఉండవని ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పది రోజులపాటు ముసురు వర్షంతో

మిగతా 6వ పేజీలో...

20 రోజుల్లో 200 మి.మీ వర్షపాతం

జిల్లాలో వార్షిక వర్షపాతం 755.5 మి.మీ కాగా ఒక్క అక్టోబరులోనే 205.50 మి.మీ కురుస్తుంది. అందులో అక్టోబరు 20వరకు సుమారు 150 మి.మీ కురవాల్సి ఉండగా ఇంచుమించు 200 మి.మీ మేర పడింది. ఈనెల 14నుంచి 17 వరకూ వాయుగుండం ప్రభావం జిల్లాపై ఉండగా ఆ సమయంలోనే కాక అంతకు ముందు రెండు మూడు రోజులు, తర్వాత మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిశాయి. శుక్ర, శనివారాల్లో సుమారు 27.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో దాదాపు 17.9 మి.మీ కురిసింది. అప్పటికే సాధారణం కన్నా ఎక్కువగా, కొన్ని మండలాల్లో రెండు, మూడు రెట్లు అధికంగా కురిసిన వర్షాలు పంటలను నష్టపర్చాయి. ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో జిల్లాలోనే అత్యధికంగా సింగరాయకొండ మండలంలో 65.20 మి.మీ వర్షపాతం నమోదైంది. చీమకుర్తిలో 59.0, ఒంగోలులో 50.40, కొనకనమిట్లలో 48.0, కొత్తపట్నంలో 44.0, పొదిలిలో 42.4 మి.మీ కురిసింది. మరో పది మండలాల్లో 15నుంచి 30 మి.మీ నమోదైంది. ఇతర ప్రాంతాల్లోనూ జల్లులు పడ్డాయి.




తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద ఉరకెత్తిన పొగ తోట(ఇన్‌సెట్లో) వెలిగండ్ల మండలం పందువ గ్రామంలో మొలకెత్తిన సజ్జకంకులను చూపుతున్న రైతు

డబ్బు కొట్టు... లైసెన్స్ పట్టు!

- దీపావళికి బాణసంచా విక్రయ దుకాణాలకు అనుమతుల్లో చేతివాటం
- దరఖాస్తుదారులతో రెవెన్యూ సిబ్బంది బేరాలు



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగకు తాత్కాలికంగా బాణసంచా విక్రయించేందుకు ఇచ్చే లైసెన్సుల విషయంలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. దరఖాస్తుదారులతో బేరాలు మాట్లాడుకొంటున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఈ వ్యవహారంలో

మిగతా 6వ పేజీలో...


గండికి మరమ్మతులు చేస్తున్న అధికారులు, రైతులు

మువ్వావారిపాలెం చెరువుకు గండి

6

పృథులగిరీశుని భూమి హాంఫట్

దేవస్థాన స్థలంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- రెండు దశాబ్దాల క్రితమే గోశాల పేరుతో పాగా
- రూ.15కోట్ల విలువైన స్థలంలో ప్రస్తుతం శాశ్వత నిర్మాణాలు
- చోద్యంచూస్తున్న దేవదాయశాఖ అధికారులు


గోశాల ప్రాంగణం

పొదిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామికే కొందరు వ్యక్తులు శఠగోపం పెడుతున్నారు. ఆలయానికి చెందిన విలువైన భూమిని ఆక్రమించి గోసంరక్షణ పేరుతో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. పొదిలి పట్టణానికి కూతవేటు దూరంలో పొదిలి - దర్శి ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ఓ ప్రజాప్రతినిధి సహకారంతో పావులు కదుపుతున్నారు.

గోసంరక్షణ సమితి పేరుతో వ్యవహారం

పొదిలి పట్టణానికి సమీపంలో పొదిలి రెవెన్యూ పరిధిలో ఖాతా నంబరు 1491, సర్వే నంబరు 424-2లో 3.26 ఎకరాల దేవదాయ శాఖ భూమి ఉంది. రెండు దశాబ్దాల క్రితం వరకు దానికి కౌలు వేలం నిర్వహించే వారు. ఆ భూమిని గోసంరక్షణ సేవాసమితి కౌలు వేలం దక్కించుకొని అప్పటి నుంచి వారే అనుభవంలో ఉన్నారు. కాలక్రమేణా అందులోని వ్యక్తులు మారారు. కమిటీ పేరుతో కొత్త వారు చొరబడ్డారు.

శాశ్వత కట్టడాలు కడుతున్నారు..

ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ భూమి విలువ రూ.15కోట్లు ఉంటుంది. దానిపై గోసంరక్షణ సేవా సమితి నిర్వాహకులు కన్నేశారు. 20 రోజులుగా అక్రమంగా శాశ్వత కట్టడాలు కడుతున్నారు. అయినప్పటికీ దేవదాయశాఖ అధికారులు చోద్యంచూస్తున్నారు. దేవుడి భూమికే రక్షణ

మిగతా 6వ పేజీలో...

ఆ వృద్ధుల జీవితంలో తేజస్సు!


గుంటిగంగలోని తేజా వృద్ధాశ్రమం

- అనాథలకు ఆసరాగా వృద్ధాశ్రమం
- ముగ్గురితో మొదలై 19 మందికి చేయూత
- ఇంటికంటే మిన్నగా సౌకర్యాలు
- దాతల సహకారంతో నిర్వహణ

7

మురిసిన పల్లె
ముగిసిన పండుగ

- వారం రోజులు ఉత్సాహంగా కార్యక్రమం
- గ్రామాల్లో భారీగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- మంత్రి స్వామితోసహా కీలక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం
- జోరువానలోనూ పాల్గొన్న ప్రజానీకం

ఒంగోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో వారంరోజులపాటు ఉత్సాహంగా సాగింది. ఆదివారంతో ముగిసింది. ఈవారం రోజులపాటు తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా కొనసాగించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామితో సహా అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు తమ తమ ప్రాంతాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లోని టీడీపీ శ్రేణులు, అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధి పథకం మెటీరియల్ నిధుల అనుసంధానంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, నీటి సంరక్షణ, ఇతరత్రా 30వేల పనులను సుమారు నాలుగున్నర వేల కోట్లతో ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమంలో

మిగతా 6వ పేజీలో...

రోజుకు రెండు, మూడు గ్రామాల్లో కార్యక్రమాలు

జిల్లాలో ఈవారం రోజులపాటు తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా రోజుకు రెండు, మూడు గ్రామాల్లో ముఖ్యనేతలు స్వయంగా శంకుస్థాపనలు, భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈనెల 18న టీడీపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాపును అధినేత, సీఎం చంద్రబాబు మంగళగిరిలో నిర్వహించగా దానికి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఆ ఒక్క రోజు మినహా ఇతర ఆరు రోజులు ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఒక ట్రెండ్రోజులు ఒకరిద్దరు మినహా మిగతా వారు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే గ్రామాల్లో అభివృద్ధి పనులకు స్వీకారం చుట్టడంతో ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పాల్గొన్నాయి. అలా వారం పాటు సాగిన ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. చివరి రోజున కూడా వివిధ ప్రాంతాల్లో కీలక నేతలు పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నాగులుప్పలపాడు మండలంలోని నాగులప్పలపాడు, అమ్మనబ్రోలు, చవటపాలెం తదితర గ్రామాల్లో పాల్గొనగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు.


బేస్తవారపేటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అపార నష్టం

5వ పేజీ తరువాయి
అవస్థలు పడిన రోజువారీ కూలీ పనులు, చిరు వ్యాపారులు చేసుకొనే వారు ప్రస్తుతం వర్షం తెరపి ఇవ్వడంతో ఆ పరిస్థితి నుంచి తేరుకుంటున్నారు. రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారు.

7,194 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంట నష్టాలు భారీగా వెలుగుచూస్తున్నాయి. 26 మండలాల్లోని 119 గ్రామాల్లో 7,241 మంది రైతులకు చెందిన సుమారు 7,194.47 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అందులో సజ్జ 1,883,47 హెక్టార్లు, మినుము 1,339, జొన్న 3, అలసంద 1,683, పత్తి 1,958, వరి 120, కొర్ర 8, పొగాకు 200 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ముగిసిన పల్లె పండుగ

5వ పేజీ తరువాయి
భాగంగా చేపట్టింది. ఇందుకోసం ఈనెల 14నుంచి 20 వరకు ఊరూరా శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించి సంక్రాంతి నాటికి వాటిని పూర్తిచేయాలని నిర్దేశించింది. తదనుగుణంగా జిల్లాలో సుమారు రూ.126.19 కోట్లతో 1,168 పనులను కలెక్టర్ మంజూరు చేయగా వాటికి శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. ఈనెల 14నుంచి 20 వరకు జిల్లాలో సాగిన ఈ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవి స్వామి తొలిరోజున కొండపి మండలం పెట్లూరులో లాంఛనంగా ప్రారంభించారు. ఇతర నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రారంభించారు.

డబ్బు కొట్టు... లైసెన్స్ పట్టు!

5వ పేజీ తరువాయి
కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో పెద్దఎత్తున బాణసంచా విక్రయాలు

దీపావళి పండుగకు జిల్లాలో పెద్దఎత్తున బాణ సంచా విక్రయాలు జరుగుతాయి. మూడురోజులపాటు లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. బాణసంచా విక్రయాల ద్వారా మంచి లాభాలు కూడా ఉండటంతో వ్యాపారులు లైసెన్స్‌ల కోసం పోటీపడతారు. అయితే వారంతా ముందుగా దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం మీసేవ, సచివాలయాల నుంచి పలు రకాల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకుంటారు. వీటిని పరిశీలించిన అనంతరం రెవెన్యూ అధికారులు లైసెన్సులు మంజూరు చేస్తారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 22వతేదీతో గడువు ముగుస్తుంది.

మొదలైన వసూళ్లు

రెవెన్యూ అధికారుల నుంచి లైసెన్స్ పొందిన వారు ఈనెల 29నుంచి 31వతేదీ వరకు మూడురోజులపాటు ప్రభుత్వ యంత్రాంగం గుర్తించిన ప్రదేశాల్లో బాణ సంచా విక్రయించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది కీలకంగా ఉంటాయి. దీపావళికి బాణసంచా వ్యాపారం జిల్లా కేంద్రమైన ఒంగోలులోనే అధికంగా ఉంటుంది. ఆతర్వాత మార్కాపురం, కనిగిరి డివిజన్ కేంద్రాల్లో కూడా ఎక్కువగా జరుగుతుంది. మండల కేంద్రాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నా రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. ఈనేపథ్యంలో ఆర్డీవో కార్యాలయాల్లో పని చేసే కొందరు ఉద్యోగులు ఇప్పటికే దరఖాస్తుదారులతో బేరసారాలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల వసూళ్లు కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రమైన ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులు లైసెన్స్‌ల మాటున జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్డీవోలు ఇటీవలనే బాధ్యతలు స్వీకరించడంతో ఆ ఉద్యోగులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు.

పృథులగిరీశుని భూమి హాంఫట్

5వ పేజీ తరువాయి
లేకపోవడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ గోశాలలో 35 ఆవులు మాత్రమే ఉండగా, ఆ భూమిలో అక్రమ నిర్మాణాలతోపాటు 1.50ఎకరాల్లో బోరువేసి జన్నుగడ్డి పెంచుతున్నారు. అయితే గోశాల సంరక్షణకు 50 సెంట్ల స్థలం సరిపోతుంది. కానీ విలువైన భూమిని కైంకర్యం చేసేందుకే నిర్వాహకులు అడ్డదిడ్డంగా కట్టడాలు నిర్మించి గోసంరక్షణ సేవాసంఘం పేరుతో కబ్జాకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీరికి స్థానికంగా ఓ ప్రజాప్రతినిధి సహాయ సహకారాలున్నట్లు ఆరోపణలున్నాయి. ఈవోకు సదరు ప్రజాప్రతినిధి ఫోన్ చేసి ఆ వైపు కన్నెత్తి చూడొద్దని చెప్పినట్లు తెలిసింది.

అడ్డగోలుగా సహకరించిన అధికారులు

రెండు దశాబ్దాలకు పూర్వం ఆ భూమిని కొందరు లీజుకు తీసుకున్నారు. అనంతరం గోశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో అధికారులు కౌలు వేలం నిర్వహించకుండా వీరి లీజును పునరుద్ధరిస్తూ వచ్చారు. ఆతర్వాత గోశాల నిర్మాణంపై దేవదాయశాఖ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించినట్లు తెలిసింది. అయితే అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయలేదు. ఆ తర్వాత కూడా లీజు పనురుద్ధరణ కాకుండా ఇప్పుడు 'యూజ్ అండ్ ఆక్యుపేషన్' పేరుతో రసీదు చూపుతూ వారు ఆ భూమిలో అనుభవంలో ఉన్నట్లు రికార్డు చేస్తున్నారు.! తద్వారా విలువైన భూమిని పూర్తిగా దేవాలయానికి దూరం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నేతలు

పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమిలో అక్రమ కట్టడాల విషయాన్ని మర్రిపూడి మండలానికి చెందిన అధికార పార్టీ నాయకులు కొందరు ఇటీవల మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మంత్రి సైతం అక్రమ కట్టడాలపై ఆరా తీసినట్లు సమాచారం. ఆనంతరం ఆలయ భూములకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మాట వాస్తవమే. ఇప్పటికే నిర్వాహకులను పిలిపించి పనులను నిలిపివేయాలని స్పష్టం చేశాం. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటాం.

- శ్రీనివాసరావు, పృథులగిరి ఆలయ ఈవో

4 నుంచి విద్యార్థులకు పరీక్షలు

ఒంగోలు విద్య అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నవంబరు 4నుంచి 7వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో ఎన్.సుబ్బారావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ డీసీఈబీ ద్వారా ప్రశ్న పత్రాలు అందజేస్తారు. ఎస్ఏఎంపీ-1 పరీక్ష తరహాలో ప్రతిరోజూ ఒక పరీక్షకు బదులుగా ప్రస్తుతం రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు

వర్షాలకు గుంతల్లో చేరిన నీరు

ప్రజల అవస్థలను గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆయన సూచనలతో చర్యలు చేపట్టిన టీడీపీ నేత

హనుమంతునిపాడు(కనిగిరి), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అధ్వానరోడ్డులో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి స్పందించారు. ఆయన సూచనలతో స్థానిక నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించారు.

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వివిధ రోడ్లలో ప్రయాణం ప్రజలకు నరక ప్రాయంగా మారింది. కనిగిరి నుంచి కంభం, వేములపాడు వెళ్ళే ప్రధాన రహదారిలో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓవీ రోడ్డుగా పిలువబడే ప్రధాన రహదారిలో మట్టిరోడ్డు కంటే అధ్వానంగా తయారైంది. అడుగడుగునా రోడ్డుపై పెద్ద గుంతలుపడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం కురిసిందంటే రోడ్డులో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉద్యోగస్థులు, ప్రజలు నిత్యం నరకాన్ని చవిచూస్తు ఆయా మార్గంలో వెళ్లేందుకు భయపడుతున్నారు. వేములపాడు మార్గం ఘాట్ రోడ్డు కావటంతో పాటు గుంతలు పడిన రోడ్డులో పడితే ఎక్కడ ప్రాణాలు కోల్పోతామో అని ప్రజలు ఆందో



ఇటీవల కురిసిన వర్షాలకు హనుమంతునిపాడు గ్రామం వద్ద కాలువను తలపిస్తున్న రహదారి

ళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో అయితే వాహనదారుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. దశాబ్దకాలం క్రితం వేసిన రోడ్డు కావటంతో అడుగడుగునా రోడ్డుపై ఉన్న తారు లేచిపోయి, రోడ్డంతా కోసుకుపోయింది. వర్షాలు పడిన సమయంలో అయా గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి.

ఎమ్మెల్యే సూచనలతో మరమ్మతులు

వారం రోజులుగా కనిగిరి ప్రాంతంలో కురిసిన వర్షాలకు కంభం రోడ్డు అధ్వానంగా మారింది. ప్రజల ఇబ్బందులు గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సాని కొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్)కి సూచించారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఎస్టీఆర్ ప్రత్యేక వాహనాల ద్వారా క్వారీ డస్ట్‌ను తోలించి రోడ్డుపై గుంతలను పూడ్పించారు. కనిగిరి - కంభం రోడ్డులోని వేములపాడు, హనుమంతునిపాడు గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో కూడా మట్టిని తోలించి ఇబ్బందులు తొలగించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి అభివృద్ధిలో భాగంగా పాడైన ఆర్అండ్‌బీ రహదారులను మెరుగు పరిచేలా ప్రభుత్వానికి నివేదిక సిద్ధం చేశారని ఎస్టీఆర్ తెలిపారు. త్వరలోనే రోడ్లకు మహర్దశ తీసుకువస్తారని తెలిపారు.



గ్రావెల్ డస్ట్‌తో గుంతలను పూడ్చుతున్న కూలీలు

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దు

- సంతనూతలపాడు, ఉప్పుగుండూరులో స్థానికుల నిరసన

సంతనూతలపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని, దీనివల్ల పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సంతనూతలపాడులోని పెద్దబజారు సెంటర్‌వాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటు చేయబోతున్న స్థలానికి ఎదురుగా సాయిబాబా మందిరం, గ్రంథాలయం, ట్యూషన్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ఇటువంటి ప్రాంతంలో మద్యం దుకాణం సబబు కాదని, జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



సంతనూతలపాడులో మద్యం దుకాణం వద్దంటూ నిరసన తెలుపుతున్న పెద్దబజారు వాసులు



ఉప్పుగుండూరులో మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

మద్యం షాపును తరలించాలి

నాగులుప్పలపాడు: ఇళ్ల సముదాయాల సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీనిని మరోచోటకు తరలించాలంటూ ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ కూడలి వద్ద పలువురు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీకే26 మద్యం షాపు వద్ద గ్రామానికి చెందిన కొంజేటి శ్రీనివాసరావు, దొడ్డపునేని సుబ్బయ్య ఆధ్వర్యంలో మహిళలు, స్థానికులు ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల తమకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ అడిగిన వారిని దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపునకు అతి సమీపంలో పోలేరమ్మ గుడి ఉండగా అక్కడికి వచ్చే భక్తులకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. పక్కనే ప్రభుత్వ వైద్యశాల సబ్‌సెంటర్, పార్కు కూడా ఉన్నాయన్నారు. నిత్యం అటుగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారని, అధికారులు స్పందించి మద్యం షాపును జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. అమరా లక్ష్మి, మున్నంగి విజయలక్ష్మి, దొడ్డపనేని జ్యోతి, మల్లిపెద్ది స్రవంతి, పావులూరి సుబ్బరావమ్మ, పావులూరి జ్యోతి, దొడ్డపనేని పావని, కొంజేటి సాయిశరణ్, మల్లిపెద్ది బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీఏ బృందం

క్రీడా రంగంలో రాజకీయ జోక్యం తగదు

- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వం రాకతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్
- ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్

పర్చూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడా రంగంలో రాజకీయ జోక్యం తగదని, గత వైసీపీ హయాంలో ఆ రంగం నిర్వీర్యమైందని ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి అధ్యక్షుడు (ఏసీఏ) బీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పర్చూరులోని వైజంక్షన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న రుగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణాన్ని ఏసీఏ బృందం పరిశీలించింది. తొలుత ప్రాంగణంలోని వసతులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు.

క్రీడారంగం అభివృద్ధి, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్‌ను ఉండేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన ప్రతిపాదన మేరకు పర్చూరులోని క్రికెట్ క్రీడా ప్రాంగణం కోసం పరిశీలించామన్నారు. లక్షల వ్యయంతో ప్రాంగణం ఏర్పాటు చేస్తున్న ఇంటూరి వంశీని ఆయన అభినందించారు. దీనిని మరింత అభివృద్ధి చేసి జిల్లా, రాష్ట్ర, రంజీ స్థాయి పోటీలు నిర్వహించే విధంగా తమవంతు సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్ మాట్లాడుతూ పర్చూరు అంటే క్రికెట్ అన్న నానుడిని గుర్తించి వారికి మరింత ప్రోత్సాహం అందించాలన్న ఆశయంతో ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ ప్రసంశనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ కొల్లా మధు, ప్రతినిధులు సాయి కృష్ణ, సతీష్, టీడీపీ నాయకులు మక్కెన శేఖర్‌బాబు, షేక్ షంషుద్దీన్, మామిడిపాక హరిప్రసాద్, అగ్నిగుండాల వెంకట కృష్ణ, చెరుకూరి చింపయ్య (శ్రీధర్), జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, దీర్ఘాల రమేష్, తోట మణి, పర్చూరు క్రికెట్ క్లబ్ ప్రతినిధులు తులసి శ్రీనివాసరావు, రంగిశెట్టి రవికుమార్, ముత్యాల రాజేష్, కొసనా రమేష్, శివాలశెట్టి రవి, ఆకుల సురేష్, జవహర్ పాల్గొన్నారు.

యువ రైతుకు పురస్కారం

మార్టూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : యువ రైతుకు రైతు నేస్తం పురస్కారం లభించింది. ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తూ వ్యవసాయంలో పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన యువ రైతు పెంట్యాల శరత్‌బాబు రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. రైతు నేస్తం పత్రిక 20వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయరంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టరు ఐవీ సుబ్బారావు పేరిట వ్యవసాయ అనుబంధ రంగాలలో సేవలను అందించిన వారికి రైతు నేస్తం పురస్కారాలు-2024 పేరిట అందచేస్తున్నారు. శ్రీముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తం సంయుక్త నిర్వహణలో ఆదివారం కృష్ణాజిల్లా, గన్నవరం సమీపంలో ఆత్కూరు, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పురస్కారాలను ప్రదానం చేశారు. అవార్డులను అందుకున్న 20 మంది రై తుల్లో శరత్‌బాబు ఉన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు శరత్‌బాబుకు పురస్కారాన్ని అందజేశారు. కా ర్యక్రమంలో రైతు నేస్తం పత్రిక ఎడిటర్ పద్మశ్రీ పురస్కారగ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శరత్‌బాబుకు పురస్కారం అందజేస్తున్న వెంకయ్య

పెరిగిన వరి సాగు

- గతంలో 500, ప్రస్తుతం 1,150 ఎకరాల్లో నాట్లు
- సాగర్ నీరు రావడంతో రైతుల మొగ్గు
- కలిసొచ్చిన వర్షాలు

మార్టూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మండలంలో వరి సాగు పెరుగుతున్నది. సాగర్ కాలువ రావడంతో రైతులు వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్‌లో 1150 ఎకరాలలో వరి సాగుచేపట్టారు. గత సీజన్‌లో ఖరీఫ్‌లో కేవలం 400 నుంచి 500 ఎకరాలను మాత్రమే సాగుచేశారు. ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరిగింది. మండలం లో సాగర్ కాలువ సమీపంలో ఉన్న గ్రామాలైన బొ ల్లాపల్లిలో 150, కోలలపూడిలో 200, ఇసుకదర్శిలో 200, జొన్నతాళిలో 100, ఇంకా వలపర్ల, నాగరాజుపల్లి, తాటివారిపాలెం, చిమ్మిరిబండ, ద్రోణాదుల తదితర గ్రామాలలో వరి పంట సాగు చేపట్టారు. ప్రస్తుతానికి సాగర్ కాలువ రావడంతోపాటు వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాది మండలంలో సుమారు 4500 ఎకరాలలో సాగు చేయగా, ప్రస్తుతం 10వేల ఎకరాలలో సాగుచేసే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ఇసుకదర్శి లాంటి గ్రామాలలో గత ఏడాది మొక్కజొన్న సాగుచేసిన పొలాల్లో ఈ ఏడాది మాగాణి పంటను సాగుచేయడం విశేషం. మరి కొన్ని గ్రామాలలో మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా మాగాణిని సాగు చేస్తున్నారు. గత ఏడాది మొక్కజొన్న రైతులు నష్టపోలేదు. అయితే వారం రోజులుగా కురిసిన వానలు మండలంలో ఉద్యాన పంటలకు ఊపిరినిచ్చాయి.

నాగరాజుపల్లి పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు





ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం (ఫైల్)

నాటి తప్పిదం.. నేడు మూల్యం

- ప్రైవేటు స్థలంలో సిమెంట్ రోడ్డు వేసిన కార్పొరేషన్
- కార్యాలయ ఫర్నిచర్ జప్తు చేసి నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు తీర్పు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సుమారు ఇరవై నాలుగేళ్ల క్రితం ఒంగోలు నగరపాలక సంస్థ చేసిన నిర్వాకానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామ సర్వే నెం. 202లోని ఓ ప్రైవేటు స్థలంలో సంబంధిత యజమానుల అనుమతి లేకుండా సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే తమ స్థలంలో రోడ్డు ఎలా వేస్తారంటూ యజమానులైన అబ్బూరి ఆదిశేషయ్య, అబ్బూరి విజయ్‌బాబు, శెనగళ్ళ సుబ్బారెడ్డిల కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం సుమారు 24 సంవత్సరాల నుంచి కోర్టులో నడుస్తుండగా, 2023లో కోర్టు యజమానులకు నష్టపోయిన భూమి విలువపై 12 శాతం వడ్డీ, ఖర్చులు కలిపి చెల్లించాలని ఆదేశించింది. అయితే అప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో మరోసారి భూమి యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఇప్పటి వరకు నిర్లక్ష్యంగా వ్యవహారండంపై మరో తీర్పు ఇచ్చింది. భూమి యజమానులకు చెల్లించాల్సిన సొమ్మును కార్యాలయ కంప్యూటర్లు, బల్లలు, బీరువాలు జప్తు చేసి అయినా చెల్లించాలని ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.హేమలత తీర్పు చెప్పారు. దీంతో కార్పొరేషన్ అధికారులు కోర్టు తీర్పును గౌరవించి, తమ ఫర్నీచర్‌ను తనఖా పెట్టి తమ వాదనలు వినిపించుకునేందుకు అవకాశం కోరినట్లు తెలిసింది. మరోసారి ఈ వివాదంపై వాదనలు జరిగే అవకాశం ఉండగా, ఆ తర్వాత కోర్టు తీర్పును గౌరవిస్తూ జనరల్ ఫండ్ నుంచి అయినా చెల్లించే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.



స్వగ్రామం పరిధిలోని హైవేలో బ్రిడ్జీలు పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

బ్రిడ్జీలను పరిశీలించిన మంత్రి స్వామి

టంగుటూరు, అక్టోబరు 20 (టంగుటూరు): రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం తన స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని బ్రిడ్జీలను పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో బ్రిడ్జీల పరిస్థితి ఎలా ఉన్నది అన్న విషయాన్ని గమనించారు. గ్రామం ఎదురుగా జాతీయ రహదారిలో ఉన్న బ్రిడ్జీలను నిశితంగా పరిశీలించారు. మంత్రి వెంట హైవే అధికారులు, పలువురు గ్రామస్థులున్నారు.

ముగ్గురు ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు

టంగుటూరు ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలోని ముగ్గురు సిబ్బందిపై ఏపీడీ వెంకటస్వామి పీడీ జోసఫ్‌కి ఫిర్యాదు ఇచ్చారు. సమయ పాలన పాటించడం లేదని, విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని తదితర కారణాలను అందులో పేర్కొన్నారు.

నేటి నుంచి వేటపాలెంలో అంతర్ కళాశాలల ఆటల పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో గుర్తింపు పొందిన 224 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బాపట్ల జిల్లా వేటపాలెంలో సోమవారం నుంచి అంతర్ కళాశాలల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్.ఐ దేవీవరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు బ్యాడ్మింటన్, షటిల్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు వేటపాలెంలోని బీబీహెచ్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ పోటీల్లో చెన్నై ఎస్ఆర్‌కే యూనివర్శిటీలో జరిగే అంతర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టును ఎంపిక చేస్తారు. పోటీలను యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

జిల్లాలో 17.9 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 17.9 మి.మీ వర్షపాతం నమోదైంది. సింగరాయకొండ 65.2, చీమకుర్తి 59.0, ఒంగోలు 50.4, కొనకనమిట్ల 48.0, కొత్తపట్నం 44.0, పొదిలి 42.4, సంతనూతలపాడు 30.6, జరుగుమల్లి 29.2, పామూరు 24.2, పొన్నలూరు 24.2, కురిచేడు 20.0, కనిగిరి 19.6, టంగుటూరు 19.5, పీసీపల్లి 17.2, సీఎస్‌పురం 16.2, నాగులుప్పలపాడు 15.6, దొనకొండ 14.0, దర్శి 12.4, మద్దిపాడు 11.0, వెలిగండ్ల 10.8, పుల్లలచెరువు 10.4 మి.మీ వర్షపాతం కురిసింది. మిగిలిన మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి.



ఎక్స్‌కవేటర్‌తో గండిని పూడ్చుతున్న గ్రామస్థులు

ముప్పావారిపాలెం చెరువుకు గండి

- పూడ్చడానికి శ్రమించిన గ్రామస్థులు, అధికారులు

చీమకుర్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పావారిపాలెం చెరువుకు ఆదివారం గండిపడింది. చెరువులోని నీరంతా బయటకు వెళ్లటంతో గ్రామస్థులు గండిపూడ్చే ప్రయత్నం చేశారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికపై చెరువు గండి పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. చివరకు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. పూర్తిస్థాయిలో చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, తెలుగురైతు కార్యదర్శి ఎనికపాటి లక్ష్మీనరసయ్య అధికారులను కోరారు. సర్పంచ్ రవి, టీడీపీ నాయకులు బ్రహ్మాజీ, బొడ్డు రామారావు, రైతులు రావులపల్లి సుబ్బారావు, బొడ్డపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆ వృద్ధుల జీవితంలో తేజస్సు!

ఓ అనాథ అపూర్వ ఆలోచన

మలి వయస్సు వారికి ఆసరాగా వృద్ధాశ్రమం

- ముగ్గురితో మొదలై 19 మందికి చేయూత
- ఇంటికంటే మిన్నగా సౌకర్యాలు
- దాతల సహకారంతో నిర్వహణ

కోట్లాది రూపాయల ఆస్తిపాస్తులు ఇచ్చిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరి జీవితాన్ని గడుపుతున్న కాలమిది. కొడుకూ కోడళ్లు, కూతురూ అల్లుళ్లు... పెద్దలను భారంగా భావించే రోజులివి. కొన్నిచోట్ల వృద్ధులకు తమ బిడ్డల నుంచే వేధింపులు సైతం తప్పని తరుణమిది. మొత్తంగా బంధాలకూ, అనుబంధాలకూ, అప్యాయతలకూ సమాధి కడుతున్న ఈ రోజుల్లో 'నేనున్నాను' అంటూ ఆసరా అందిస్తున్న ఓ మహర్షిపై ప్రత్యేక కథనం..


తేజా ఆశ్రమంలో ఉన్న వృద్ధులు

తాళ్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండలం గుంటిగంగమ్మ సన్నిధిలో ఓ పూరిపాకలో తేజా వృద్ధాశ్రమం ఉంది. దీనిని నిర్వహిస్తున్నది.. ఏ కోటీశ్వరుడో కాదు. ఓ బాలల ఆశ్రమంలో పెరిగి అంతులేని కష్టాలు అనుభవించిన ఓ అనాథ. ఆయనే అంబటి వెంకటేశ్వరరెడ్డి. చీమకుర్తి మండలం పాటిమీదపాలేనికి చెందిన ఈయన నిరుపేద యువకుడు. 2011లో తేజా వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. ప్రారంభంలో ముగ్గురు వృద్ధులతో మొదలై ఇప్పుడు 19 మంది ఆసరా కల్పిస్తున్నారు. తమ వారి నుంచి అలనాపాలనా కరువైన తాళ్లూరు, చీమకుర్తి, దర్శి, వినుకొండ, విజయవాడ ప్రాంతాలకు చెందినవారు ఇక్కడ ఆసరా పొందుతున్నారు. దాతల ప్రోత్సాహంతో 14 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతోంది. ఇంకా ఎవరైనా సహకరిస్తే మరింత అభివృద్ధి చేస్తామని వెంకటేశ్వరరెడ్డి చెప్పారు.

కుటీర పనుల్లో వృద్ధులు

- ఆశ్రమంలోని వృద్ధులు ఖాళీగా ఉండకుండా కూరగాయల పెంపకం, కొవ్వొత్తుల తయారీ, ఇస్తర్లు తయారీ పనులు చేస్తుంటారు.
- వారి ఆర్యోగం పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. తూర్పుగంగవరంలోని ఆర్ఎంపీ వైద్యులు ఆశ్రమాన్ని సందర్శిస్తూ వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.
- వృద్ధులు తామంతా ఒకే కుటుంబం అన్నట్లుగా జీవనం సాగిస్తున్నారు. ఎవరికి కష్టం వచ్చినా తమ కష్టంగానే భావించి ఒకరికొకరు సహాయపడుతున్నారు.

ఆశ్రమ నిర్వహణ ఎంతో ఆనందంగా ఉంది

నా చిన్నతనంలో కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగాలేక విజయవాడలో అనాథ ఆశ్రమంలో ఉండి చదువుకున్నా. అనంతరం గ్రామానికి వచ్చి జీవనం సాగించా. తన చిన్ననాటి బాధలు గుర్తుకు వచ్చి గుంటిగంగ సన్నిధిలో వయోవృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశా. దాతల సహకారంతో రూ.50 లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మించి ఆశ్రమాన్ని కొనసాగిస్తుండటం ఆనందంగా ఉంది. సమీప గ్రామాలవారు ఆశ్రమ నిర్వహణకు తమ వంతు సహకారం అందించటంతో నూతన భవనంలో ప్రత్యేక గదులు కూడా నిర్మాణం చేపట్టాం. స్థితిమంతులు వృద్ధులను ఆశ్రమంలో ఉంచేందుకు వస్తే వారి వద్ద నుంచి కొంత నగదు తీసుకుని ఆశ్రమంలో వసతి కల్పిస్తాం.

-అంబటి వెంకటేశ్వరరెడ్డి, నిర్వాహకుడు



అందరం కలుపుగోలుగా ఉంటున్నాం



మాది విజయవాడ. నేను ఆరేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నా. వృద్ధాప్యంలో ప్రశాంతంగా ఉండేందుకు ఆలోచిస్తుండగా తెలిసిన వ్యక్తి ద్వారా తేజా ఆశ్రమానికి చేరుకున్నా. ఎలాంటి అరమరికల్లేకుండా ఉన్నాం. తమకు చేతనైన పనులు తలా ఒకటి చేసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నాం. మా ఆరోగ్యం పట్ల ఆశ్రమ నిర్వహకుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

- వాడరేవు ధనలక్ష్మి, విజయవాడ

ఒంటరితనంతో ఆశ్రమానికి వచ్చా



నా భర్త టీడీపీ వీరాభిమాని. గత ప్రభుత్వంలో సీఎం చంద్రబాబును అకారణంగా అరెస్టు చేసి జైలుకు పంపటంతో నా భర్త గుండెపోటులో మృతి చెందాడు. మాకు సంతానం లేదు. తేజా వృద్ధాశ్రమం విషయం తెలుసుకుని ఒంటరిగా ఉండలేక ఇక్కడ చేరా. సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆశ్రమానికి వచ్చి స్వయంగా ఓదార్చి నాకు ఆర్థిక సాయం అందించటం మురవలేను.

- జంపాల ప్రసన్నలక్ష్మి, మార్కాపురం

అయినవారికంటే ఆదరణ చూపుతున్నారు



నేను అయిన వారి ఆదరణకు కరువై ఆశ్రమానికి వచ్చా.నాకు 90 ఏళ్లు. మా కుటుంబ సభ్యులు పట్టించు కోకపోయినా నిర్వహకుడు చూపే శ్రద్ధ మరువలేనిది. ఆశ్రమానికి చెందిన పనులను తన శక్తిమేరకు చేస్తూ, ఊరక ఉండకుండా ఆశ్రమంలో తన తోటి వారికి చేతనయింత సాయం చేస్తున్నా.

- కొడిమెల సుబ్బరాయుడు

మేట్ల ద్వారా ఉపాధి పనులు : ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుగంగవరం, మన్నేపల్లి గ్రామాల్లో మేట్ల ద్వారా కూలీలకు పనులు కల్పిస్తామని ఎంపీడీవో కె.సుందరరామయ్య, ఏపీవో మురళి తెలిపారు. 'కూలీలకు ఉపాధి కరువు' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో, ఏపీవోలను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులకు చర్యల నిమిత్తం నివేదిక అందజేశామని వారు తెలిపారు. తూర్పుగంగవరం, మన్నేపల్లి పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం కోసం చాట్ల డానీ, గొంది నాగరాజ్యంల ప్రతిపాదనలు కార్యాలయంలో అందజేశారన్నారు. వారిద్దరికీ ప్రస్తుత సంవత్సరం, గత మూడేళ్లుగా 25 రోజుల పనిదినాలు లేకపోవటంతో ఎన్ఆర్ఈజీఎస్ నిబంధనల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకానికి అర్హత లేదన్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో మేట్లను పరిగణనలోకి తీసుకుని వారి ద్వారా ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. ఆ గ్రామాల్లో ఉపాధి పనులు జరిగేలా చర్యలు చేపడతామని డ్వామా పీడీకి నివేదిక ద్వారా వారు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

వరిపైరుకు నీరు కట్టేందుకు మోటారు ఆన్‌చేస్తుండగా ఘటన


నాగార్జున మృతదేహం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 20 : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఉయ్యాలవాడ పంచాయతీ పరిధిలో ఆదివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉయ్యాలవాడ పంచాయతీ పరిధిలోని అంకనాంపల్లె గ్రామానికి చెందిన రాచగొల్ల నాగార్జున (26) ఇటీవల వరకు వలంటీర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా గిద్దలూరు పట్టణంలో ఎరువుల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తూ ఖాళీ సమయంలో వ్యవసాయ పనులు కూడా చేస్తున్నాడు. ఆదివారం తమ సొంత పొలంలో సాగు చేసిన వరిపైరుకు నీరు కట్టేందుకు పొలానికి వెళ్లాడు. పొలంలో ఉండే మోటార్‌ను ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై నాగార్జున అక్కడికక్కడే మృతిచెందాడు. నాగార్జున మృతితో కుటుంబంతో పాటు గ్రామంలోనే విషాదఛాయలు అలుముకున్నాయి. నాగార్జున మృతదేహానికి టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాలకృష్ణ నివాళ్లు అర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. నాగార్జున తల్లిదండ్రులు చిన్నపిచ్చయ్య, అనంతమ్మలకు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



ఎగసిపడుతున్న నిర్లక్ష్యం!

పొదిలి మండలంలోని కుంచేపల్లి గ్రామ సమీపంలో సాగర్ ప్రధాన పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దర్శి నుంచి పొదిలి మీదుగా కనిగిరి వెళ్లే ప్రధానపైపు లైన్ పగలడంతో పది అడుగుల ఎత్తున నీరు ఎగసిపడుతోంది. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేసి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. - పొదిలి, ఆంధ్రజ్యోతి



వచ్చేస్తోంది... రైలు రెస్టారెంట్!

కుటుంబంతో కలిసి రైలెక్కి ఏసీలో కూర్చుని రుచికరమైన మెనూ ఆర్డర్ ఇచ్చి.. కబుర్లు చెప్పుకుంటూ తింటుంటే... ఆహా ఆ ఆహ్లాదం అద్భుతం.. ఆ అనుభూతి అదుర్స్.. రెస్టారెంట్‌కు వెళ్లి తిన్నా ఆ ఫీల్ రాదు కదూ! ఒంగోలులో ఆ ఫీల్‌ను తీసుకొచ్చే సమయం వచ్చింది. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా రైల్ బోగీ రెస్టారెంట్ ఏర్పాటు చేయబోతున్నారు. ఆదివారం ఒక బోగీని లారీ ట్రాలీపై తీసుకొచ్చారు. త్వరలో అన్ని హంగులూ కల్పించి రెస్టారెంట్ ప్రారంభించనున్నారు. ఈ బోగీని తీసుకొచ్చే క్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద లారీపై ఉన్న బోగీ వెనుక భాగం కరెంటు స్తంభానికి తగలడంతో అది విరిగిపోయింది. ఆ ప్రాంతంలో ఐదు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది వచ్చి విరిగిన స్తంభాన్ని తొలగించి మరొకటి ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

- ఒంగోలుక్రైం (ఆంధ్రజ్యోతి)

సిబ్బందిని ఇచ్చారు.. తహసీల్దార్‌ను మరిచారు

- ఏడాదిగా ఇదే పరిస్థితి
- కలగా ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం
- సిద్ధంగా సిబ్బంది, సామగ్రి
- రూరల్ సిబ్బంది కూడా అర్బన్‌కే పరిమితం
- పనుల ఆలస్యంతో ప్రజలకు ఇబ్బందులు

తహసీల్దార్ కార్యాలయం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు కలగానే మిగిలింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఒకే తహసీల్దార్ కావడంతో ఒకవైపు పని ఒత్తిడి, మరోవైపు ప్రొటోకాల్‌తో సకాలంలో పనులు జరగడం లేదని గత ప్రభుత్వ హయాంలో ఒంగోలు రూరల్ మండల గ్రామాలకు ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని కేటాయించారు. గత ఏడాది ఫిబ్రవరి 28న నోటిఫికేషన్ ఇవ్వగా, అదే ఏడాది జూలై 27న ఒంగోలు రూరల్ మండల కార్యాలయం ఏర్పాటు చేశారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహించారు. ఆ సభల్లో రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు అంగీకారం తెలపడంతో తదనుగుణంగా ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్‌కు గ్రామాల కేటాయింపుతో పాటు తహసీల్దార్ కార్యాలయానికి అవసరమైన భవనాన్ని కూడా ప్రస్తుతం ఉన్న ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలోనే కేటాయించారు. ఒంగోలు అర్బన్ ప్రాంతంలో 12 గ్రామాలు, ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో తొమ్మిది గ్రామాలను కేటాయించారు. ఆ కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని కూడా ఇచ్చారు.

తహసీల్దార్ మినహా..

ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి తహసీల్దార్ మినహా మిగిలిన సిబ్బందిని నియమించారు. సత్వరమే ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయడం, సిబ్బంది నియామకం చేయడంతో ప్రజలకు సత్వర సేవలు అందుతాయని భావించారు. కానీ ఏడాది కాలంగా కేవలం సిబ్బందిని నియమించారే తప్ప తహసీల్దార్‌ను నియమించలేదు. దీంతో కార్యకలాపాలన్నీ ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ పరిధిలోనే కొనసాగుతున్నాయి. ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుతో పాటు మరో మూడు అటెండర్ పోస్టులను మంజూరు చేసి సిబ్బందిని కూడా కేటాయించారు. అయితే తహసీల్దార్‌ను నియమించకపోవడంతో ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ సేవలు కలగానే మిగిలాయి.

ఒంగోలు అర్బన్‌కు కేటాయించిన గ్రామాలు

ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి 12 రెవెన్యూ గ్రామాలను కేటాయించారు. ఇందులో ముక్తినూతలపాడు, గుడిమెళ్లపాడు, కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం, పెళ్లూరు, అన్నవరప్పాడు, మామిడిపాలెం, వెంగముక్కలపాలెం, ఒంగోలు నగరం, మల్లేశ్వరపురం, త్రోవగుంట గ్రామాలు ఉన్నాయి.

రూరల్ పరిధిలో..

ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయానికి తొమ్మిది రెవెన్యూ గ్రామాలను కేటాయించారు. దీని పరిధిలో దేవరంపాడు, ఉలిచి, చేజర్ల, కరవది, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల, మంగళాద్రిపురం, వలేటివారిపాలెం, మండువవారిపాలెం గ్రామాలు ఉన్నాయి.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు

ఒంగోలు రూరల్ మండల కార్యాలయానికి నియమించిన సిబ్బంది ప్రస్తుతం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆ కార్యాలయానికి అవసరమైన సిబ్బంది కొనసాగుతున్నారు. రూరల్ మండలానికి కేటాయించిన సిబ్బంది పనిచేసేందుకు కార్యాలయం ఉన్నా తహసీల్దార్ లేని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. గత ఐదారు నెలల నుంచి ఒంగోలు రూరల మండల ప్రజానీకం తమకు తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

పోలీసు లాంఛనాలతో సుబానీ అంత్యక్రియలు

కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఐ, ఎస్సై


నివాళి అర్పిస్తున్న సీఐ ప్రభాకర్

పెద్ద దోర్నాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ దూదేకుల మహబూబ్ సుబానీ(31) స్వగ్రామం చిన్నగుడిపాడులో ఆదివారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సుబానీ స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. చీమకుర్తి వద్ద రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందిన విషయం విధితమే. ఈ క్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు, దోర్నాల ఎస్సై వీ.మహేశ్ పోలీసు సిబ్బందితో చిన్నగుడిపాడు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనంతరం పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సుబానీ భార్య రసూల్‌బీ ప్రస్తుతం నిండు గర్భిణిగా ఉన్నారు. సుబానీకి పద్దెనిమిది నెలల కుమార్తె జాఫ్రిన్, తల్లిదండ్రులు నాగుల్ మీరమ్మ, వలి ఉన్నారు.

వేలం కేంద్రంలో ఒకే ఒక్కడు

- అన్ని పనులూ నిర్వహణాధికారికే..
- పలువురు సిబ్బంది ఉద్యోగ విరమణ
- మరికొందరు బదిలీ
- మందకొడిగా బ్యారన్ రిజిస్ట్రేషన్లు
- పంపిణీకాని ఎరువులు
- సూచనలు, సలహాలు ఇచ్చేవారు కరువు
- పొగాకు సాగు రైతుల అవస్థలు


పొగాకు వేలం కేంద్రం

కొండపి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గడచిన నాలుగేళ్లుగా ఒక్కొక్కరిగా బోర్డు పర్మినెంట్ ఉద్యోగులు ఉద్యోగ విరమణలు పొందడం, బదిలీలు కావడంతో ఈ ఏడాదికి ప్రస్తుతం వేలం కేంద్రంలో బోర్డు పర్మినెంట్ ఉద్యోగిగా వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ ఒక్కరే మిగిలిపోయారు. మిగతా క్షేత్ర సహాయకులంతా కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఈ సీజన్‌లో క్షేత్ర స్థాయి అధికారి, ఎస్‌జీవో రెండు బాధ్యతలు చూస్తున్న ఉద్యోగి రెండు నెలలు క్రితం ఉద్యోగ విరమణ పొందారు. కర్ణాటక నుంచి బదిలీపై వచ్చిన ఫీల్డ్ ఆఫీసర్ తిరిగి కర్ణాటకలో సీజన్ ప్రారంభం కావడంతో బదిలీపై వెళ్లారు.

సమయం లేదు మిత్రమా..

ప్రస్తుతం రైతుల బ్యారన్ రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉంది. పొగాకు మొక్కలు నాటే సీజన్ కూడా మొదలైంది. బోర్డు ద్వారా ఇచ్చే ఎరువులు రైతులకు పంపిణీ చేయాల్సిన సమయం మించిపోతోంది. వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పెట్టిన పొగాకు నారుమడులను పరిశీలించి వాటిని కాపాడుకునేందుకు నారుమడుల నిర్వాహకులకు సలహాలు, సూచనలు చేయడంతోపాటు, అనుమతికి మించి పొగాకు ప్లాంటేషన్ పడకుండా వేలం కేంద్రం సిబ్బంది గ్రామాల్లో తిరిగి రైతులకు అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. కొండపి పొగాకు వేలం కేంద్రంలో ప్రస్తుతం వేలం నిర్వహణాధికారి ఒక్కరే బోర్డు ఉద్యోగి కాగా, మరో ఐదారుగురు కాంట్రాక్టు క్షేత్ర సహాయకులుగా పనిచేస్తున్నారు. ఫీల్డ్ ఆఫీసర్‌గానీ, ఎస్‌జీవోగానీ ఎవరూ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పర్మినెంట్ సిబ్బంది కొరత

వేలం కేంద్రం పరిధిలో 2,830 బ్యారన్‌లున్నాయి. 3,982 మంది రైతులు ఉన్నారు. ఈ ఏడాది దాదాపు 17.29 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు వేలం కేంద్రం పరిధిలో జరిగాయి. ఇంత పెద్ద వేలం కేంద్రంలో బోర్డు పర్మినెంట్ సిబ్బందిని నియమించకపోవడాన్ని రైతులు ఆక్షేపిస్తున్నారు. బోర్డు ఉన్నతాధికారులు కొండపి పొగాకు వేలం కేంద్రానికి పర్మినెంట్ సిబ్బందిని నియమించి త్వరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి, ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రామతీర్థం గంగమ్మగుడి జలమయం

● ఇబ్బందిపడుతున్న భక్తులు



నీటిలోనే పూజలు చేస్తున్న భక్తులు

చీమకుర్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రామతీర్థం గంగమ్మతల్లి గుడి లోపల ప్రాంగణం అంతా జలమయమైంది. రోజూ పడుతున్న వర్షాలతో గుడిలోపల ప్రాంతమంతా వర్షపునీటితో నిండిపోయింది. ఆదివారం ఈ గుడికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నీటిలో నిలబడే భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయం చుట్టుపక్కల మెరకగా ఉండటం, లోపల పల్లం కావటంతో చుట్టుపక్కలనుంచి వర్షపునీరు చేరుతుంది. వర్షపునీరు బయటకుపోయే మార్గం లేకపోవటంతో సమస్యగా మారింది. తక్షణమే అధికారులు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

టంగుటూరు, అక్టోబరు 20 (టంగుటూరు): రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం టంగుటూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి రావూరి తిరుమల రాధాక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినీల 17వ వర్ధంతి సందర్భంగా ఫౌండేషన్‌తోపాటు జిల్లా అంధత్వ నివారణా సంఘం సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైన మందులు ఉచితంగానే అందజేస్తారు. శుక్లం ఆపరేషన్లు పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రిలో చేస్తారని చెప్పారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కొండపి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెట్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఆదివారం పూర్తి చేశామని ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. శనివారం సాయంత్రం పిడుగుపాటు కారణంగా 11కేవీ సబ్‌స్టేషన్‌లోని 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. షిఫ్ట్ ఆపరేటర్ అప్రమత్తతతో ట్రాన్స్‌ఫార్మర్ సురక్షితమైనా, అందులో ఏర్పడిన సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొండపి నుంచి విద్యుత్ సరఫరాను పెట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు అందించి ప్రజల ఇబ్బందులను తీర్చామన్నారు. తిరిగి 3ఫేజ్ విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు మరమ్మతులను అసిస్టెంట్ ఇంజనీర్ సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించామని ఏఈ చెప్పారు.

ఏఈవోలకు ఉద్యోగోన్నతులపై హర్షం

చీమకుర్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పనిచేస్తున్న విస్తరణాధికారుల ఉద్యోగోన్నతులపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవటంపట్ల విస్తరణాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిబ్బంది కొరతను అధిగమిస్తూ విస్తరణాధికారులకు ఉద్యోగోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.

విశ్వగురువుగా భారత్ : ఏబీఆర్ఎస్ఎం



అతిథులను సత్కరిస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని 2047 నాటికి విశ్వగురువుగా మార్చేక్రమంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించనున్నారని అఖిల భారతీయ రాష్ట్రీయ శక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్‌జీ పేర్కొన్నారు. ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు వైవీ.రామిరెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణ్‌జీ మాట్లాడుతూ ఏబీఆర్ఎస్ఎం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అగ్రగామి ఉపాధ్యాయ సంస్థ అని చెప్పారు. సుమారు 15 లక్షల మంది ఉపాధ్యాయులు ఇందులో పని చేస్తున్నారన్నారు. నూతన ఉద్యోగాల సృష్టించడం ద్వారా దేశంలో పేదరికాన్ని నిర్మూలించడం, అలాగే భారతీయ విద్యా వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రధాని నరేంద్రమోదీ జాతీయ విద్యావిధానం-2020 తీసుకువచ్చారన్నారు. క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ జాతీయ స్ఫూర్తితో పాటు తమ సబ్జెక్టుల్లో అద్భుతమైన నైపుణ్యాలతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎన్.కిషన్, జి.రంగనాథ్, రంజిని, ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను సూర్యకళ్యాణచక్రవర్తి సత్కరించారు.

జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం పూర్తి

మద్దిపాడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు నేరుగా ఖాతాలోకి కూలి డబ్బులు చెల్లించేందుకు వీలుగా ఆధార్‌తో జాబ్‌కార్డు అనుసంధానం ప్రక్రియ మండలంలో పూర్తయింది. గతంలో కూలీలకు డబ్బులు రాగానే తపాలాశాఖ కార్యాలయం వద్ద బారులు తీరేవారు. ప్రస్తుతం ఆ విధానం తొలగించి బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపు విధానాన్ని అమలు చేయడంతో నగదు ఉపసంహరణ సులువుకానుంది. కూలి డబ్బులు ఖాతాలో పడగానే వారి సెల్‌ఫోన్‌లకు సంక్షిప్త సమాచారం వస్తుంది.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన గ్రానైట్ రగడ!

● నేడు అధికారుల సమక్షంలో పంచాయితీ



శ్లాబులను లోడింగ్ చేస్తున్న కూలీలు

చీమకుర్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ శ్లాబులను ఎక్స్‌పోర్ట్ చేసే బయ్యర్లు, 3 సెంటీమీటర్ల శ్లాబులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న రగడ ముదిరింది. పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవటం వరకూ వచ్చింది. ఈ గోల మాకెందుకు అనుకుంటున్న సీఐ సుబ్బారావు.. మైనింగ్, విజిలెన్స్, జీఎస్టీ అధికారుల సమక్షంలో పంచాయితీ పెట్టుకొని తేల్చుకోండి.. అధికారులు కోరితే శాంతిభద్రతలకు భంగం కలుగకుండా సహకరిస్తాం అని తేల్చిచెప్పారు. దీంతో ఇరువర్గాలకు చెందినవారు, అధికారుల సమక్షంలోనే సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సమస్యకు పరిష్కారం కనుగొనాలని నిర్ణయించారు. క్వారీల నుంచి కొనుగోలు చేసిన ముడిరాయిని 3 సెంటీమీటర్ల మేర శ్లాబులను కటింగ్ చేసే ఫ్యాక్టరీలు 50 వరకూ బూదవాడ ప్రాంతంలో ఉన్నాయి. వారందరూ సపరేటుగా ఇటీవల కాలంలో 3సీఎం ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. కాగా పెద్ద ఫ్యాక్టరీలకు చెందిన ఓనర్లలో కొంతమంది బయ్యర్లు కూడా ఉన్నారు. వీరే అటు 3సీఎం ఫ్యాక్టరీ ఓనర్ల వద్ద నుంచి 3సీఎం శ్లాబులను కొనుగోలు చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. ఇటు తమ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి అయ్యే 3సీఎం శ్లాబులను సైతం ఆర్డర్ల మేరకు ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. అయితే ఇక్కడే చిక్కు వచ్చిపడింది. తమ వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు ఎక్కువ ధరకు అమ్ముకుంటూ లాభపడుతున్నారని ఇటీవల సదరు బయ్యర్ల ఫ్యాక్టరీల నుంచి ఎగుమతికి లోడింగ్ అవుతున్న శ్లాబుల రవాణాను 3సీఎం ఓనర్లు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య రాజీచర్చలు జరిగి ధర పెంచి శ్లాబులను కొనుగోలు చేయటానికి బయ్యర్లు ఒప్పుకున్నారు. ప్రస్తుతం సమస్య రూటు మార్చుకుంది. ఇటీవల కాలంలో శ్లాబులకు ఆర్డర్లు భారీగా వస్తుండటంతో ఎవరికి వారు డిమాండ్ ఉన్నపుడే అమ్ముకొని సొమ్ము చేసుకుందామనే ఆతృతలో ఉన్నారు. ఈ క్రమంలో బయ్యర్లుగా ఉన్న ఫ్యాక్టరీ ఓనర్లు తమ వద్ద భారీగా ఉన్న నిల్వలను ఎగుమతి చేసుకోవటానికి సిద్ధమయ్యారు. దీంతో తమ పరిస్థితి ఏమిటని 3సీఎం ఫ్యాక్టరీ ఓనర్లు సదరు బయ్యర్లను నిలదీశారు. తమ తరఫు నుంచి ఒక కంటైనర్, మీ తరఫునుంచి ఒక కంటైనర్ దామాషాలో కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం బయ్యర్‌కు చెందిన ఫ్యాక్టరీ నుంచి శ్లాబులు లోడింగ్ చేస్తుండగా అసోసియేషన్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో సదరు యజమాని అడ్డుకున్న 3సీఎం ఓనర్ల అసోసియేషన్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి ప్రతిగా శనివారం నాడు 3సీఎం ఓనర్ల అసోసియేషన్ నాయకులు బయ్యర్లపై అక్రమంగా శ్లాబులను రవాణా చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై పోలీసులు ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. ఈక్రమంలో సోమవారం అధికారుల సమక్షంలో నిర్వహించే పంచాయితీలో పరిణామాలను బట్టి కేసు నమోదు చేసే అవకాశం ఉంది. ఎటువంటి పరిణామలకు దారితీస్తుందో వేచిచూడాల్సి ఉంది.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



చవటపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పల్లెపండుగలో భాగంగా నాగులుప్పలపాడులో రూ.30లక్షలు, చవటపాలెంలో రూ.15లక్షలు, అమ్మనబ్రోలులో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, సైడుకాలువల నిర్మాణాలకు ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభలో ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. పల్లెల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మార్చారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. మండలానికి పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.5కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారధ్యంలో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నాయకులు గుమ్మడి సాయిబాబా, మారెళ్ల వెంకట శేషయ్య, మారెళ్ల కిరణ్, దొడ్డా సీతయ్య, ఈదర రాజు, నాని, ఈదర సుబ్బారావు, మెట్టు సుబ్బయ్యనాయుడు, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి, మండల ప్రత్యేకాధికారి బేబీరాణి, ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, డీఈ కృష్ణమోహన్, ఏఈ రవి, ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.

దూరంగా పాత టీడీపీ వర్గం

నాగులుప్పలపాడులో ఆదివారం జరిగిన పల్లెపండుగలో గ్రామంలోని టీడీపీలో నెలకొన్న ఆధిపత్య పోరుతో పాత వర్గానికి చెందిన పలువురు నాయకులు దూరంగా ఉన్నారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు తీసుకొన్న వారు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను అవమానించేలా వ్యవహరించారని వారు ఆరోపించారు. కొత్త వ్యక్తులు పెత్తనం చెలాయిస్తూ ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన తమను బాధించారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే బీఎన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

నగరంలో డ్రైనేజీలపై ర్యాంపుల తొలగింపు

● సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి



ర్యాంపులను పగులగొడుతున్న సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ కాలువలు ఆక్రమించి వాటిపై నిర్మించిన ర్యాంపులను కార్పొరేషన్ అధికారులు ఆదివారం తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో నీరుపోయే మార్గం లేకపోవడంతో నగరం జలమయంగా మారిన విషయం విదితమే. దీంతో కార్పొరేషన్ అధికారులు ఇందుకు గల కారణాలు గుర్తించారు. ఈ మేరకు పాత కూరగాయల మార్కెట్, మస్తాన్ దర్గా సెంటర్, కర్నూలు రోడ్, శర్మా కాలేజి ఏరియా, జీజీహెచ్ సమీపంలో కాలువలపై నిర్మించిన కట్టడాలను తొలగించారు. ప్రతి పదిహేను అడుగులకు ఒక మ్యాన్ హోల్ ఏర్పాటు చేసి, కాలువ పూడిక తీత పనులకు ఇబ్బందులు లేకుండా చూశారు. ఈ మేరకు కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఆటకం కలిగేలా నిర్మించిన ప్లాట్‌ఫారాలు, ర్యాంపులను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వ్యాపారులు గుర్తించి, ముందుగా మ్యాన్‌హోల్ వదిలిపెట్టాలన్నారు. లేని పక్షంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈ పద్మజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ సంస్థ నిర్వాకంతో ఇబ్బందులు

● అధ్వానంగా టంగుటూరు-పొదిలి రహదారి



బురదమయంగా మారిన రోడ్డు

మర్రిపూడి, అక్టోబరు 20 : ఓ ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ నిర్వాకంతో మండలంలోని టంగుటూరు - పొదిలి రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నెలరోజులుగా ఆ సంస్థ కేబుల్‌లైన్ ఏర్పాటు కోసం నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీస్తుంది. తవ్విన మట్టిని అక్కడే కుప్పగా పోస్తోంది. వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఆ మట్టి జారి మళ్లీ రోడ్డు మీదకు వస్తుంది. ఈ క్రమంలో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు వివాదాలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల స్థానిక కరెంట్ ఆఫీస్ వద్ద ఎదురెదురు వాహనాలు తప్పుకోబోయి పరస్పరం ఢీకొన్నాయి. దీంతో మార్జిన్‌లో ఉన్న తాగునీటి పైపులైన్ ధ్వంసమై మర్రిపూడి, రేగలగడ్డ, గుండ్లసముద్రం, కెల్లంపల్లి, పన్నూరు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. అలాగే మర్రిపూడి చెరువుకట్ట కింద ట్రాక్టర్ ఇరుక్కుపోయి మూడుగంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. నిబంధనల ప్రకారం మార్జిన్‌కు రెండుమీటర్ల అవతలివైపు కేబుల్ లైన్ బిగించాల్సి ఉండగా ఆ సంస్థ నిర్వాహకులు మార్జిన్‌లోనే వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లో తీసినకాలువపై రోలర్ తొక్కించి మార్జిన్‌ను పటిష్టపరచాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు రోడ్లు ఛిద్రం



అధ్వానంగా కొండపిలోని మద్దులూరురోడ్డు

కొండపి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి పలు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. అనకర్లపూడి వెళ్లే రోడ్డులో అట్లేరు వరకు రోడ్డు గుంతలమయమైంది. అదేవిధంగా నెన్నూరుపాడు, పెట్లూరు, కొండపి నుంచి జాళ్లపాలెం రోడ్డు, కట్టావారిపాలెం, నేతివారిపాలెం, కామేపల్లి గ్రామాల మధ్య రోడ్డు రోతగా తయారైంది. వర్షాలకు గోతులు పెద్దవిగా మారాయి. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగుల వివరాలను నమోదు చేస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదుమూడి గ్రామంలో ఆదివారం మన ఊరు-మన ఈదుముడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల వైద్యులు సౌమిత్ర పల్లవ్, మౌనికారెడ్డి, కుట్టుబోయిన వెంకటేష్, సరయు, పల్లవి 147మందికి పలు పలు రకాల వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల మేనేజర్ ఎస్.నాగరాజు, పీఆర్వోలు జి.పున్నయ్య, చిరంజీవి, శ్యామ్‌కుమార్, గోపి, సంస్థ సభ్యులు మేడా బ్రహ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, ఉప్పల ప్రసాదు, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల జీవితాలు మార్గదర్శకం



సన్మాన గ్రహీతలతో నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖుల జీవితాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలు అవుతాయని జానుడి సెంటర్ ఫర్ ఆర్ట్స్ డైరెక్టర్ నూకతోటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక శ్రీనగర్‌కాలనీలోని మల్లవరపు రాజేశ్వరరావుభవన్‌లో సామాజిక, సాహిత్యవేత్త గొల్లపల్లి లక్ష్మి స్మారక ప్రతిభా పురస్కార సభలో ఆయన ప్రసంగించారు. ముందుగా ప్రముఖ రచయిత్రి గొల్లపల్లి లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వివిధ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, పీఎన్‌సీపీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.గీతారాణి, ప్రముఖ కవయిత్రి గంగవరపు సునీత, ప్రముఖ న్యాయవాది నేలటూరి ధనలక్ష్మి, డాక్టర్ చాపల శాంతకుమారిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.మురళీకుమార్, బూచి అంజమ్మ, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్) అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రమా మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సంస్థ అధ్యక్షులు దేవరకొండ వెంకటేష్, సాయిమాస్టర్ నిర్వహణలో గాయకులు బియ్యపు శ్రీనివాసరావు, డి.వెంకటేష్, జి.శివప్రసాద్, వెంకట్, డీఎస్.కుమార్, కర్నాటి కోటేశ్వరరావు, ఐ.నరసింహం, చిత్ర శైలజ, సుహాసిని, విజయలక్ష్మి, ఉమామహేశ్వరి, ఉషారాణిలు పలు గీతాలను ఆలపించారు. జి.కృష్ణ, నాగేశ్వరరావు, బాలాజీ, వైవీ.రావు, పి.జానకిరాం, నిర్మలమ్మ పాల్గొన్నారు.

చదువుపై ఇష్టం పెంచుకోవాలి



విద్యార్థులతో సిబ్బంది

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇష్టంగా చదివితే ఏ విషయమైనా వెంటనే అవగాహన అవుతుందని, విద్యార్థులు చదువుపై ఇష్టం పెంచుకోవాలని ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథా లయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం జరిగింది. జాలాది మోహన్, లింగిశెట్టి అశోక్‌కుమార్‌లు కథలు బోధించారు. అనంతరం పెన్నులను బహూకరించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, పి.దయామణి, పాఠకులు పాల్గొన్నారు.

పోలీసునంటూ యువతిని తల్లిని చేసి ..

● పెళ్లికి నిరాకరించిన నిందితుడిపై కేసు

నాగులుప్పలపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగినంటూ నమ్మించి మాయమాటలు చెప్పి ఓ యువతిని తల్లిని చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ రసూల్‌బాషా తాను పోలీస్ ఉద్యోగినంటూ నమ్మబలికి నాగులుప్పలపాడు మండలం కొత్తకోటలోని ఓ యువతితో 2023 ఏడాదిలో పరిచయం పెంచుకున్నాడు. అది కాస్తా శారీరక బంధానికి దారి తీసింది. దీంతో ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే వివాహం చేసుకుంటానని రసూల్‌బాషా నమ్మబలికి చివరకు మోసం చేయడంతో ఆదివారం బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో రసూల్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నేలటూరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చీమకుర్తికి చెందిన ఎం.మల్లిఖార్జునరావు, పి.సుదర్శనరావులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కల్వర్టు సమీపంలో భారీ వాహనం రావటంతో వారు అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వారికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు



మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

సంతనూతలపాడు/మద్దిపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీపావళి బాణసంచా విక్రయాలకు పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ అనుమతిలు తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని రూరల్ సీఐ కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని బాణసంచా విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం చూపిన స్థలాల్లోనే నిబంధనలు పాటిస్తూ బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. బాణసంచా విక్రయించే ప్రాంతాల్లో చిన్నపిల్లలు లేకుండా చూడాలని, ప్రమాదవశాత్తు ఏదైన జరగకుండా ముందు జాగ్రత్తగా నీటిడ్రమ్ములు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. దుకాణాలు ఏర్పాటు కోసం ఈనెల 22వ తేదీలోపు అనుమతి పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివరామయ్య, శ్రీకాంత్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మద్దిపాడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): లింగంగుంట గ్రామంలో ఆదివారం జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,760 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు.

ఘనంగా జేసీఐ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక రవీంద్ర భారతి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షునిగా మేడిశెట్టి వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా మాజేటి గణేష్, కోశాధికారిగా కసిబిసి వీరబ్రహ్మం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ జేసీఐ సేవలను విస్తృతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. జేసీఐ ఒంగోలు అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎన్నికల అధికారి ఆకృతి రాము, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ఒంగోలు విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ చీమకుర్తి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని నారాయణ స్కూలులో జరిగిన సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శిగా ఖాదర్‌బాషా, ఆర్థిక కార్యదర్శిగా డి.రమణయ్య, మహిళా కన్వీనర్‌గా జ్యోతి, జిల్లా కౌన్సిలర్లుగా నాగయ్య, శ్రీధర్, మల్లయ్య, మల్లీశ్వరి, రమాదేవిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎన్.కోటేశ్వరరావు, పర్యవేక్షకులుగా రాంబాబులు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి బి.వెంగళరెడ్డి, రాష్ట్రకార్యదర్శి చల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

18న గుంటూరులో మాలల మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20: ఎస్సీ ,ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ నవంబరు 18న గుంటూరులో జరిగే లక్ష మాల వినతుల మహాసభను విజయవంతం చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం జేఏసీ కో ఆర్డినేటర్ జె.మురళి కోరారు. స్థానిక వెంగముక్కలపాలెం జంక్షన్ వద్ద ఉన్న మురళి కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం దళిత సంఘాలు, మాలసంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరులో జరిగే ఈ మహాసభలో జిల్లాలోని మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, చిరంజీవి, ఎరిచర్ల సుబ్రహ్మణ్యం, చప్పిడి కోటేశ్వరరావు, దారా అంజయ్య, మేడికొండ మురళీ, కొండమూరి ప్రకాష్, బాకోటి, రామాంజి, చప్పిడి డేవిడ్, జాన్సన్, అంగలకుర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దళిత, గిరిజన హక్కులను కాలరాస్తుందని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం ఆరోపించారు. స్థానిక గాంధీనగర్‌లోని అంబేద్కర్, పూలే విగ్రహాల వద్ద ఆదివారం దళిత, గిరిజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టులో తప్పుడు నివేదికలతో అట్రాసిటీ యాక్టును రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కట్టా వరప్రసాద్, సంగీతరావు, పంది రంగయ్య, దాసరి నరసింహారావు, గుత్తి కోటేశ్వరరావు, సుబ్బారావు, వీరస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

నాగులుప్పలపాడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రైలు దిగుతూ జారిపడి మహిళ గాయాలపాలయిన సంఘటన ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకొంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు, బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరమ్మ ఆదివారం బంధువులతో కలిసి వల్లూరమ్మ వెళ్లారు. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా పట్టు తప్పి కింద పడి తలకు గాయాలయ్యాయి. దాంతో బంధువులు 108వాహనంలో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

290 మందికి వైద్యసేవలు



మాట్లాడుతున్న హనుమంతరావు

సంతనూతలపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గంగవరంలోని హనుమంతరావు హైస్కూల్లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తానా సహకారంతో సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్, శంకరనేత్రాలయ, హెచ్‌సీజీ కేన్సర్ ఆసుపత్రి వైద్యులు 290 మందికి వైద్యసేవలు అందించారు. ముఖ్యఅతిథులుగా తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, హైస్కూల్ కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు హాజరయ్యారు. పలువురు రక్తదానం చేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

డయాలసిస్ రోగికి రక్తదానం

గిద్దలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఒక డయాలసిస్ రోగికి అత్యావసరంగా రక్తం అవసరం కావడంతో మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి వెళ్లి అక్కడే రక్తదానం చేసి ఆదుకున్నాడు. 44వ పర్యాయం రక్తదానం చేసిన చల్లా అశోక్‌రెడ్డిని ఆదివారం పలువురు అభినందించారు.

మహిళలపై అకృత్యాలకు నిరసనగా ర్యాలీ

గిద్దలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా 'మేమున్నాము సేవా సమితి' ఆధ్వర్యంలో గిద్దలూరులో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కడప జిల్లాలో ఇంటర్ విద్యార్థినిపై దాడి చేసి పెట్రోల్‌తో నిప్పంటించి హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలోని గాంధీబొమ్మ కూడలి నుంచి రాచర్లగేటు సెంటర్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేమున్నాము సేవా సమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

గిద్దలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం జేపీ.చెరువు గ్రామసమీపంలోని పొలాల్లో ఆదివారం కొండచిలువ సంచరించడం కలకలం రేపింది. కొండచిలువను చూసిన స్థానిక రైతులు భయాందోళనతో పరుగులు తీశారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రెస్క్యూ టీమ్ సభ్యులు కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పెద్ద దోర్నాల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషనులో రౌడీషీటర్లకు ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్.ప్రభాకర్‌రావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తులమో ఫలమో ఆశించి తప్పుడు మార్గంలో నడిస్తే జీవితమంతా నేరమయం అవుతుందన్నారు. అంతేగాక ఈ ప్రభావం మీ పిల్లలపై చూపుతుందన్నారు. ప్రవర్తన మార్చుకుని సన్మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై వీ మహేశ్, సిబ్బంది గోపాలకృష్ణ, సురేష్, మోహన్, నాగశ్రీను పాల్గొన్నారు.

రో డ్ల త



మార్కాపురంలో అలుగు సమీపంలో అడుగుకో గొయ్యి



మార్కాపురం నుంచి కొండేపల్లి వెళ్లే దారిలో రోడ్డు దుస్థితి ఇది

- మార్కాపురంలో మరీ అధ్వానంగా రహదారులు
- చెరువుకట్ట వెంబడి ప్రయాణం అంటే హడలే
- ప్రధాన రహదారుల వెంబడి కనిపించని డ్రైనేజీలు
- గిద్దలూరు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి
- వెంటాడుతున్న గత ప్రభుత్వ వైఫలాలు

గడిచిన ఐదేళ్లలో నాటి వైసీపీ ప్రభుత్వం రహదారులను గురించి పట్టించుకోలేదు. గ్రామాల్లో సైడు కాలువల ఊసే లేకుండా పోయింది. దీంతో పల్లెముంగిళ్లలో బురదదారులు వెక్కిరిస్తున్నాయి. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్లు మరీ అధ్వానంగా తయారయ్యాయి. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది.

మార్కాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో ప్రధానంగా చెరువుకట్టపై ప్రయాణం చేయాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అలుగు సమీపంలో రహదారిపై అడుగుకో గుంత దర్శనమిస్తోంది. అటుగా వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. అదేవిధంగా కొండేపల్లి రహదారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. బీటీ రహదారి కావడంతో వర్షపు నీరు నిలిచి పూర్తిగా ధ్వంసమైంది. పలుచోట్ల రోడ్డు కుంటలను తలపిస్తోంది. నూతన రహదారులు నిర్మించకపోయినా, కూటమి ప్రభుత్వం తక్షణమే మరమ్మతులు చేయాల్సి ఉంది.

కనిపించని డ్రైనేజీ రోడ్డుపైనే వర్షం నీరు

గిద్దలూరు : గిద్దలూరు మున్సిపాలిటి పరిధిలోని శివారు ప్రాంతాలలో మురుగునీటి కాలువలు కనిపించడం లేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరంతా రోడ్లపైనే నిలిచి ఉంటోంది. మెటల్ రోడ్లలో వర్షం నీరు నిలిచి బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం నడిచేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడుతున్నది. అర్బన్ కాలనీలో పలు రోడ్లతోపాటు సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. ఆయా రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారులు బురదమయం

కంభం : కంభంలోని హోండా షోరూం పక్కన ప్రధాన రహదారి, విద్యానగర్, వాల్మీకినగర్, అర్బన్ కాలనీ తదితర ప్రాంతాలలో వర్షం నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు నిర్మించక పోవడంతో రోడ్లపైనే వర్షం నీరు నిలుస్తోంది. దీంతో బురదమయంగా మారింది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఈ రోడ్లపై నడిచేం దుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అయితే వాహనాలతో సహా కిందపడి గాయాలపాలు అవుతున్నారు.

మార్కాపురం రూరల్ : మార్కాపురం నుంచి ఒంగోలు, రైల్వేస్టేషన్ రోడ్డుపై గోతులు అధికంగా పడ్డాయి. పట్టణంలోకి వచ్చే రోడ్డు మార్కెట్ యార్డు వద్ద లోతైన గోతులు ఏర్పడ్డాయి. తర్లుపాడు నుండి మార్కాపురం రోడ్డు అల్లూరి పోలేరమ్మ గుడి వద్ద, సీతా నాగులవరం వెళ్ళే రోడ్డు గుంతలమయంగా మారింది. మండలంలోని గజ్జలకొండ రోడ్డుపై రాయవరం మోకాళ్ల లోతు గోతులు పడ్డాయి. పట్టణంలోని కళాశాల రోడ్డులో లక్కి షాపు వద్ద, రీడింగ్ రూమ్ సమీపంలోని ప్రధాన రోడ్డు పై గుంతలు ఏర్పడ్డాయి. తక్షణమే రహదారులను మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గిద్దలూరు అర్బన్‌కాలనీలో సబ్‌స్టేషన్ రోడ్డు, కంభం హోండా వీధి సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు, విద్యానగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పరిస్థితి

వైభవంగా తులాభారం

● ఆర్యవైశ్య సమారాధన



అమ్మవారి తులాభారంలో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్య సమారాధన కార్యక్రమం నిర్వహించారు. 3వేల మందికి పైగా ఆర్యవైశ్యులు సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఐదు రూపాయల నాణేలతో తులాభారం ఏర్పాటు చేశారు. పూజలు అనంతరం తులాభార వేలంపాట నిర్వహించారు. ఉపాధ్యాయులు సోమిశెట్టి పాండురంగారావు రూ.50వేలకు తులాభార నాణేలను దక్కించుకున్నారు. అలాగే అమ్మవారి చేతిలోని లడ్డూను వేలం వేయగా టీవీఎస్ ఏజెన్సీస్ నిర్వాహకులు రూ.16500లకు లడ్డూను దక్కించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు, అలాగే ఉత్సవ విగ్రహాలకు అలంకరించిన చీరలను వేలం వేయగా పలువురు ఆర్యవైశ్యులు ఆ చీరలను వేలంలో దక్కించుకున్నారు. రూ.2.62 లక్షల వేలం ద్వారా దేవస్థానానికి దక్కాయి. ఆయా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్య నారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కోశాధికారి ముప్పూరి చంటి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దమ్మాల జనార్ధన్, కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆవోపా నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న నిర్వాహకులు

కంభం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమైన దివ్యాంగురాలి కుటుంబానికి నూర్‌బాషా సంఘం మండలం అధ్యక్షుడు డి.ఖాదర్‌వలి (చమన్) నిత్యావసర సరుకులు అందజేశారు. కంభం పట్టణానికి చెందిన దివ్యాంగురాలు భానుబీబేగం ప్రస్తుతం గర్భవతిగా ఉండి మంచానికే పరిమితం అయ్యారు. ఆమె కుటుంబ పరిస్థితి తెలుసుకున్న సంఘం నాయకులు స్పందించారు. ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా భానుబీబేగం మాట్లాడుతూ కష్టకాలంలో తమ అవసరాలు తెలుసుకుని ఇంటి వద్దకే వచ్చి నిత్యవసర సరుకులు అందచేసిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రస్తుతం ఆమె పింఛన్ ఆగిపోయిందని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో మాట్లాడి త్వరలోనే పింఛన్ వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఖాదర్ హుస్సేన్, జిలాని, హబీబుల్లా, అలీషా, ఇనాయితుల్లా, ఫయాజ్ పాల్గొన్నారు.

పలు చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్

మార్కాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే పలు చోరీలకు పాల్పడిన దొంగను మార్కాపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు స్థానిక వడ్డేబజార్‌లో నివాసముంటున్న కర్నూలు జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామానికి చెందిన కొండేటి ఇంద్ర పవన్‌కుమార్ కొన్నాళ్లుగా పట్టపగలే ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. స్థానిక భగత్‌సింగ్ కాలనీ, ఇండో ఫ్యాక్టరీ వెనుకవైపు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. శనివారం సాయత్రం ఇంద్ర పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద నుంచి ఏసర్ కంప్యూటర్, సామ్‌సంగ్ ఎల్ఈడీ టీవీలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో హాజరుపరచగా 14 రోజులపాటు న్యాయాధికారి రిమాండ్ విధించారు.

విద్యార్థులకు తోడ్పాటునిస్తాం

● అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం



బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : అవోపా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అవోపా రాష్ట్ర కార్యదర్శి జీవీ.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక అవోపా కార్యాలయంలో గాంధీజయంతి సందర్భంగా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలోల విజేతలకు ఆదివారం బహుమతులు అందించారు. జనరల్ సెక్రటరీ సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొని మేథస్సు పెంపొందించుకోవాలన్నారు. సీనియర్ విభాగంలో మార్కాపురం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వైవీటి చంద్రిక ప్రథమ, హైమావతి ద్వితీయ, ఓబులక్కపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ అఫ్రష్ ఉన్నీసా తృతీయ బహుమతి అందుకున్నారు. జూనియర్ విభాగంలో మార్కాపురం కమలా పాఠశాల విద్యార్థిని ఎం.వేదేశ్వరి, గజ్జలకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దేవి రాజ్యలక్ష్మీ ద్వితీయ, కలనూతల పాఠశాల విద్యార్థిని సమీరాలు తృతీయ బహుమతులు పొందారు. కార్యక్రమంలో అవోపా నాయకులు లక్ష్మణరావు, రామశేఖర్, మోహన్, సుబ్బారావు, నాగేశ్వరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

● ట్రాలీ వాహనం, మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఘటన

గిద్దలూరు టౌన్, అక్టోబరు 20 : పాలు పోసేందుకు మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రాలీ వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. అందిన సమాచారం మేరకు మండలంలోని దిగువమెట్ట గ్రామానికి చెందిన శ్రీరామ్ నాయక్ పాలు పోసుకొని జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై పాలను తీసుకొని వెళుతుండగా ఎదురుగా నంద్యాల నుండి గిద్దలూరు వైపు వస్తున్న ట్రాలీ వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీరామ్‌నాయక్‌కు గాయాలయ్యాయి. ఆయన్ను గిద్దలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీరామ్‌నాయక్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 20 ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణ శివారులలో వెలసియున్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



మర్రివేములలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం పుల్లలచెరువు మండలంలోని మర్రివేముల, ముటుకుల ,సింగుపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలోని మర్రివేములలో రూ.10 లక్షల, సింగుపల్లిలో రూ.10 లక్షలు, ముటుకులలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతముగా తీర్చిదిద్దేందుకు రూ.15 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావు నాయక్, ఏపీవో శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ సుబ్బయ్య, టీడీపీ మండలాధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు కోటారి అచ్చయ్య ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : గ్రామాల అభివృద్ధి ఒక్క టీడీపీతోనే సాధ్యమని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని నడిగడ్డ, దూపాడు, గొల్లపల్లి, విశ్వనాథపురం, సోమేపల్లి, రాజుపాలెం, త్రిపురాంతకం గ్రామాలలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన ఆయా రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా దోచుకోవడానికీ, దాచుకోవడానికే పనిచేసిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసి చూపిస్తామని అన్నారు. కార్యక్రమాలలో ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ రామ సుబ్బయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారి నుంచి ఒంగోలు రోడ్డును వెడల్పు చేయడానికి నిధులు మంజూరు కావడంతో ఆదివారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్తవారపేటకు రూ.93 లక్షలకు సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఐదేళ్లుగా, వైసీపీ ప్రభుత్వం ఎక్కడా సీసీరోడ్లు వేసిన దాఖలాలు లేవని అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో వేసిన రోడ్లు మాత్రమే గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. మరోసారి కూటమి ప్రభుత్వంలో మారుమూల గ్రామాల సైతం సీసీరోడ్లు మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర, ఏఈ నాయక్, టీడీపీ మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, బుద్దుల ప్రేమానంద్, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, దూదెకుల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే!

- బురదమయమైన పలుగ్రామాల ప్రధాన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఈదరలోని ప్రధాన రహదారి ఇలా..



మక్కెనవారిపాలెంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ముండ్లమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు బురదమయమయ్యాయి. కాలుతీసి కాలు పెట్టలేనివిధంగా తయారయ్యాయి. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ అధ్వానంగా మారాయి. వేములబండ నుంచి రమణారెడ్డి పాలెం వెళ్ళే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. దీంతో వేములబండ గ్రామస్థులు పొలాలకు వెళ్ళి పశువుల మేత తెచ్చుకోవాలన్నా వెళ్ళలేని దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహన చోదకులు రోడ్లపై జారి పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈదర గ్రామంలోని రమణారెడ్డిపాలెం వెళ్ళే ప్రధాన రహదారి చిత్తడిగా మారింది. వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోయింది. మురుగు కాలువలు లేకపోవటంతో నీరంతా రోడ్లపైకి చేరుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఈదర గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తారు రోడ్డుకు మంజూరైన నిధులు రద్దయ్యాయి. బసవాపురంలోని రహదారులూ చిత్తడిగా మారాయి. నూజెండ్లపల్లి పంచాయతీ పరిధిలోని భట్లపల్లిలో పలు వీధులు రొచ్చుగా ఉన్నాయి. మక్కెన వారిపాలెంలో సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. చినఉల్లగల్లు ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, పసుపుగల్లులోని ఎస్సీ కాలనీలోని రహదారులు దారుణంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కనీసం గ్రావెల్ మట్టి అయినా రహదారులపై తోలి ఇబ్బంలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బురదమయమైన వేములబండ - రమణారెడ్డిపాలెం రహదారి

న్యూస్ బాక్స్

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం పంచాయతీకి ఇద్దరు కార్యదర్శులు

తాళ్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపాలెం గ్రామ పంచాయతీకి ఇద్దరు కార్యదర్శులు ఉండటం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా వద్ది కోటేశ్వరరావు విధుల్లో ఉన్నారు. ఇతనిని బదిలీ చేయకుండానే చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ కార్యదర్శి షేక్ రబ్బానీఅహ్మద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అధికార పార్టీకి చెందిన నేతలు రబ్బానీహ్మద్‌ను తురకపాలెంకు నియమించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మిద్వారా సిఫార్సు లేక పంపారు. అయితే, కోటేశ్వరరావు ఇక్కడే ఉంటానని చెప్పటంతో అధికారపార్టీ నేతలు జిల్లా అధికారులను కలిసి అతనినే కొనసాగించాలని కోరినట్లు తెలిసింది. అధికారపార్టీ నేతల సిఫార్సులేఖ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు షేక్ రబ్బాని అహ్మద్‌ను తురకపాలెం పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈయన ఈనెల 7వ తేదీ ఈపూరుపాలెం-2 నుంచి రిలీవ్ అయ్యారు. తురకపాలెంలో విధుల్లో చేరేందుకు వెళ్లగా అక్కడి పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయకపోవటంతో సమస్యగా మారింది. అధికార టీడీపీ నేతల దృష్టికి సమస్య వెళ్లినా అదిగో, ఇదిగో మార్పు చేయిస్తామంటూ మీన మేషాలు లెక్కిస్తున్నారు. పదిరోజుల పాటు వేచిచూసిన పంచాయతీ కార్యదర్శి రబ్బానీ తాను జిల్లా అధికారుల ఆర్డర్ మేరకు రిలీవ్ అయినందున విధుల్లో చేర్చుకోవాలని ఎంపీపీవో కె.సుందరరామయ్యను కలిసి విన్నవించారు.

మూడురోజుల క్రితం పల్లెపండుగకు మాధవరం గ్రామానికి వచ్చిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఉన్నతాధికారులు కూడా ఉన్న పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేసి కొత్తవారిని నియమించాలన్న నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయకుండానే మరొకరిని నియమించటం చర్చనీయాంశమైంది.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు, పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ కేసులను లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకొనేవిధంగా ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. మండలంలో చిన్నపాటి నేరం కూడా జరగకుండా ఉండాలంటే ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. రాత్రిపూట గస్తీ నిర్వహించే విధంగా చూడాలన్నారు. ప్రధాన బ్యాంకులు, దేవాలయాలు వద్ద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటీవల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికమయ్యాయన్నారు. గేదెల చోరీలు కూడా పలు గ్రామాల్లో జరుగుతున్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తరచూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.నాగరాజు, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెసీమల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ముండ్లమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని భీమవరం, తూర్పుకంభంపాడు, వేంపాడు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 120 రోజుల్లో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులన్నీ అధ్వానస్థితికి చేరాయన్నారు. తట్ట మట్టిపోసిన పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు ఏ.సుజాత, ఒద్దిపోగు ఆదిలక్ష్మి, అబ్బూరి గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం డీజీపేటకు చెందిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి వెలుగుచూసింది. గ్రామానికి చెందిన డేగా రత్తమ్మ(60) అనే మహిళ పశువుల మేత కోసం గ్రామానికి సమీపంలోని పొలానికి వెళ్లింది. ఈక్రమంలో సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు చుట్టు పక్కల వారితో విచారించి పొలానికి వెళ్లిచూడగా మృతిచెంది ఉంది. ఆమె తలపై గాయాలు ఉన్నాయి. గ్రామస్థులు సీఐ భీమానాయక్, ఎస్ఐ సుమన్‌కు సమాచారం అందించారు. సంఘటానాస్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలు ధరించి ఉన్న బంగారు ఆభరణాలు లేకపోవడంతో ఎవరైనా హత్య చేసి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కనిగిరిలో ప్రజాదర్బార్

కనిగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సోమవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల, సిబ్బంది తప్పని సరిగా పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు దాదాపు అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేవిధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేపు పామూరు, పీసీపల్లిలో..

పామూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

పీసీపల్లి: ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ శర్మ తెలిపారు. మండల ప్రజలుకు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో ప్రజాదర్బార్‌కు రావాలన్నారు. అక్కడ అర్జీలను అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పాల్గొంటారని తెలిపారు.

కంటి ఆపరేషన్‌లకు తరలివెళ్లిన వృద్ధులు

కనిగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్‌లు అవసరమైన వృద్ధులు ఆదివారం గుంటూరు తరలివెళ్ళారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఈనెల 18న నిర్వహించిన శిబిరంలో 59 మంది ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వీరిలో 14 మందిని ప్రత్యేక వాహనంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. ఉదయాన్నే అమరావతి గ్రౌండ్‌కు వచ్చిన వృద్ధులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి భోజన వసతి ఏర్పాటు చేసి గుంటూరు తరలించారు.

పామూరులో ఉచిత కంటి పరీక్షలు

పామూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ గద్దె ఏడుకొండలు అశ్విని వైద్యశాలలో నెల్లూరు మోడరన్ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో సుమారు 96 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, పీఆర్వో పి.శ్రీనివాసరావు, అశ్వని హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

సీఎస్‌పురం(పామూరు) అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల మధ్యంతర భృతి, డీఏను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటరావు, పాదుషా, వేమ నారాయణ, శ్రీనివాసరాజు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఎం.సురేష్, తిరుపతయ్య, వైవీ సుబ్బారావు, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ముండ్లమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. తమకు అందిన సమాచారంతో ఎస్ఐ సిబ్బందితో వెళ్ళి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఆరుగు పేకాటరాయుళ్లు పట్టుబడగా, వారినుంచి రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు



మారెళ్ళలో తడిసి పాడయిన వైట్‌బర్లీ పొగాకు

ముండ్లమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లింది. రెడ్డినగర్ గ్రామానికి చెందిన పేరం రవీంద్రారెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల్లో శనగ సాగు చేశాడు. నాలుగు రోజుల క్రితం పంట కోయగా, వర్షానికి నీటి పాలైంది. సుమారు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. రూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బసవాపురంలో కట్టా చిన వెంకం బొట్లు అనే రైతు నాలుగు ఎకరాల్లో మిర్చి సాగుచేయగా, వర్షానికి పూర్తిగా ఉరకేసింది. దీంతో రెండు లక్షల మేర నష్టం వాటిల్లింది. అదే గ్రామంలో వైట్‌బర్లీ పొగాకు కూడా నష్టం వాటిల్లింది. మారెళ్ళ, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, తమ్మలూరు, నాయుడుపాలెం గ్రామాల్లో వైట్ బర్లి పొగాకు, చినఉల్లగల్లు, కెల్లంపల్లి, కమ్మవారిపాలెం, రాజగోపాలరెడ్డినగర్, వేముల గ్రామాల్లో సజ్జ పైరు పూర్తిగా వర్షానికి దెబ్బతింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

కురిచేడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సైడు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రైవేటు బస్సు డ్రైవర్ దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పొదిలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు వెళుతుంది. అదేక్రమంలో ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు పామూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతుంది. దర్శి నుంచి కురిచేడుకు వస్తున్న మార్గంలో ఆర్టీసీ బస్సుకు ప్రైవేటు బస్సు డ్రైవర్ సైడు ఇవ్వకుండా కురిచేడు వరకు వచ్చాడు. ఈక్రమంలో కురిచేడు సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ ప్రైవేటు బస్సును క్రాస్‌చేసి ముందుకెళ్లి అడ్డుగా పెట్టి ఎందుకు సైడు ఇవ్వలేదని ప్రశ్నించారు. మాటామాట పెరిగి ప్రైవేటు బస్సు డ్రైవర్ ఆర్టీసీ బస్సులోకి వెళ్లి డ్రైవర్‌పై దాడి చేశారు. ఇద్దరూ డ్రైవర్‌లు బస్సులోనే కొట్టుకోగా ప్రయాణికులు సర్దిచెప్పారు. ఈక్రమంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు రాకతో సమస్య సద్దుమణిగింది.

అక్రమంగా నిల్వఉంచిన బాణసంచా పట్టివేత

కనిగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. కనిగిరి పట్టణంలోని రామాలయం వీధిలో వలారాం అనే వ్యక్తి ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో ఎలాంటి అనుమతులు లేకుండా రూ87వేలు విలువ కలిగిన టపాసులను నిల్వ ఉంచారు. అజ్ఞానవ్యక్తి ఇచ్చిన సమాచారంతో పోలీసులు షాపులో తనిఖీలు చేయగా, క్రాకర్స్ టపాసుల బండిల్స్ పట్టుబడ్డాయి. షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. తనిఖీలో పట్టుకున్న టపాసులను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ టి.శ్రీరాం, వీఆర్వో శ్రీకాంత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో అలారం కలకలం

కనిగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ కార్యాలయంలో ఆదివారం అలారం మోగటంతో కలకలం రేగింది. ఒంగోలు బస్టాండు సమీపంలో ఉన్న ఎస్‌బీఐ కార్యాలయంలో రాత్రి 9 గంటల సమయంలో పెద్దశబ్దంతో అలారం మోగడంతో స్థానికులు ఆందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడికి వచ్చి పరిశీలించారు. అలారం వైరును ఎలుక కొరకటంతో మోగిందని పోలీసులు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి గోశాలలో గోవులకు పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కె.చినఆదినారాయణ, మాజీ చైర్మన్ ఎం. మాధవప్రసాద్, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 21 అక్టోబరు 2024



6



సముద్రానికి ఆనకట్టగా నిలిచిన మడ అడవి

మడ రక్షణ కవచం

- సునామీ, తుఫాన్లను ఎదుర్కొనే శక్తి
- 2018లో అంతర్జాతీయంగా గుర్తింపు
- జీవ వైవిద్యానికి నిలయం మడ అడవులు
- రేపల్లె తీరంలో అభయారణ్యంగా అభివృద్ధి

సముద్రంలో 20 మీటర్ల ఎత్తు ఎదిగిన మడ అడవి

ఎక్సైజ్.. ఖుషీ



ఆదాయమే

ఆదాయం.. కాసుల గలగలలతో ఎక్సైజ్ కళకళలాడుతోంది. దరఖాస్తుల నుంచి లైసెన్సు ఫీజుల వరకు రూ.కోట్లు ఆదాయాన్ని ఎక్సైజ్ కళ్ల చూసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో తొలి ఏడాది మద్యం ఆదాయం సుమారు రూ.424కోట్లు వచ్చినట్లు సమాచారం. వైసీపీ పాలనలో నిస్తేజంగా మారిన ఎక్సైజ్ విభాగం కూటమి ఏలుబడిలో గత వైభవం దిశగా అడుగులేస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ మొదలు లాటరీ, లైసెన్సులు జారీ, స్టాక్‌కు ఇండెంట్, దుకాణాల ప్రారంభం తదితర అంకాలన్నీ విజయవంతంగా ముగియడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు రాబడి ఆశించిన స్థాయిలోనే దక్కడంతో ఎక్సైజ్ శాఖ ఆనందంలో ఉంది.

- మస్తుగా మత్తు రాబడి
- దరఖాస్తుల ఆదాయం రూ.184 కోట్లు
- లైసెన్సు ఫీజు సుమారు రూ.240 కోట్ల ఆర్జన
- వైసీపీ పాలనలో నిస్తేజంగా ఎక్సైజ్ విభాగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం నిర్వహించింది. మద్యాన్ని నియంత్రిస్తూ అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ విభాగాన్ని వైసీపీ ప్రభుత్వం పనిలేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం మద్యం నూతన పాలసీని ప్రవేశపెట్టి మద్యం వ్యాపారాన్ని ప్రైవేటుకు అప్పగించింది. మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి మొదలైన ప్రక్రియ ఇటీవల లైసెన్సుదారులు షాపులు ప్రారంభించడంతో ఓ కొలిక్కి వచ్చింది. దీంతో ఎక్సైజ్ విభాగానికి అటు దరఖాస్తుల రూపంలో కానీ ఇటు లైసెన్సు ఫీజు తొలి వాయిదా రూపేణా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరింది. అన్నింటికన్నా మించి వైసీపీ ప్రభుత్వంలో విధులకు తమను దూరం చేసిందనే భావనలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ప్రైవేటు ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి క్షణం తీరిక లేకుండా పనిఒత్తిడిలో నిమగ్న మయ్యారు. బాపట్ల జిల్లాలో మొత్తం 7 సర్కిళ్ల పరిధిలో 117 షాపుల లైసెన్సుల కోసం ప్రభుత్వం నోటి ఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. గడువు ముగిసే ఈ నెల 11 నాటికి మొత్తం 2,149 దరఖాస్తులు రాగా దీని రూపేణా రూ.43 కోట్లు ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరింది. లాటరీలో షాపులు దక్కించుకున్న లైసెన్సుదారులు ఏడాదికి 6 వాయిదాల్లో లైసెన్సు ఫీజు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించగా తొలి వాయిదాలో ఎక్సైజ్ శాఖకు సమకూరిన ఆదాయం రూ.12.7 కోట్లుగా ఉంది. ఇది తొలి వాయిదానే కానుండడంతో ఏడాది ముగిసే సరికి లైసెన్సు ఫీజు ద్వారానే దాదాపు .రూ.73 కోట్లు రాబడి రానుంది. ఇది రెండో ఏడాదిలో మరింత పెరగనుంది. గుంటూరు జిల్లాలో 127 షాపులకు 4,448 దరఖాస్తులు రాగా రూ.89 కోట్ల ఆదాయం ఖజానాకు జమైంది. పల్నాడు జిల్లాలో 129 షాపులకు 2,638 దరఖాస్తులు రాగా రూ.52 కోట్ల ఆదాయం సమకూరింది. తొలి ఏడాది లైసెన్సు ఫీజు రూపంలో గుంటూరు జిల్లాలో రూ.87కోట్లు, పల్నాడు జిల్లాలో 80 కోట్ల రానుంది. మూడు జిల్లాలకు కలిపి మొత్తం ఏడాదికి లైసెన్సు ఫీజు రూపంలో రూ.240 కోట్లు ప్రభుత్వానికి రాబడి రానుంది.

నిబంధనలపై కసరత్తు

మద్యం దుకాణాలను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసుకోవడానికి ఈ నెల చివరివరకు ఎక్సైజ్ శాఖ వెసులుబాటు ఇచ్చింది. ఇందులో భాగంగా లెసెన్సుదారులు అమ్మకాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో షాపు పెట్టడానికి వ్యాపారులు అన్వేషిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ రికార్డుల్లో నమోదై ఉన్న గుడులు, బడులతో పాటు ఆస్పత్రులకు వంద మీటర్ల దూరంలోనే షాపులు ఉండాలి. ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోగా మొన్నటి వరకు ఉన్న ప్రభుత్వ దుకాణాలు మూతపడ్డాయి. వాటిలోని స్టాక్‌తో పాటు ఇతర ఆస్తులను ఇప్పటికే రెవెన్యూ విభాగం సమక్షంలో గణించి భద్రపరిచారు.

నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి...

దుకాణాల ఏర్పాటులో ఎక్సైజ్‌శాఖ జారీచేసిన మార్గదర్శకా లను పాటించేలా లైసెన్సుదారులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ నెలఖారువరకు ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుని నిబంధనల ప్రకారం ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని వ్యాపారం సాగించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కూడా దృష్టి పెడతామని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఒత్తిళ్లు..

లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు ఇప్పటికే తాత్కాలిక ప్రాతిపదికన షాపులు ఏర్పాటు చేసుకున్నారు. పలు చోట్ల రద్దీ ప్రాంతాల్లో పోటీ పడడంతో కూతవేటు దూరంలోనే షాపులు ఏర్పాటు చేసుకున్నారు. బాపట్ల చీలురోడ్డు సెంటర్‌తో పాటు మార్కెట్ ఏరియాలో ఇదే పరిస్థితి నెలకొంది. షాపులు మార్చుకోవడానికి ఈ నెల చివరి వరకు ఎక్సైజ్ శాఖ గడువు ఇవ్వడంతో ఓ అవగాహనకు వచ్చి షాపులను దూరంగా పెట్టుకోవడానికి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. మరో వైపు ఇప్పటికీ షాపుల దక్కించుకున్న వారితో తెరవెనక బేరసారాలు ముమ్మరంగానే జరుగుతున్నట్లు సమాచారం. పాలకపార్టీ నేతల అనుచరగణం లైసెన్సు దారులపై ఒత్తిడి తెచ్చి తాము భాగస్వాములయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ అధినాయకత్వం ఇప్పటికే మద్యం, ఇసుక వ్యవహారల్లో నేతల జోక్యం సహించేది లేదని తేల్చి చెప్పడంతో చాలా మంది నేతలు వెనకడుగు వేసినప్పటికీ వారి అనుచరగణం మాత్రం పట్టు వీడకుండా రాయబారాలు నడుపుతూనే ఉన్నారు.



యంత్రాలు.. ఎప్పుడిస్తారో?

- రాయితీ పరికరాల కోసం నిరీక్షణ
- పంటలకు సూక్ష్మ పోషకాలూ లేవాయె
- కల్లాలపై కప్పే పట్టలకు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయకారిగా ఉంటాయి. పంటలకు నష్టం వాటిల్లకుండా మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్ పట్టలు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. గత టీడీపీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రాయితీపై యంత్రపరికరాలను, సూక్ష్మపోషకా లను, ఉచితంగా టార్పాలిన్ పట్టలు పంపిణీ చేసింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని విస్మరించడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు దాటుతున్నా రాయితీ పరికరాలు, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్ పట్టలు పంపిణీ ఊసే మరిచింది. గత టీడీపీ పాలనలో యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలను క్రమం తప్పకుం డా రాయితీపై పంపిణీ చేసినట్లే ఇప్పుడు కూడా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. యంత్రపరికరాలు, సూక్ష్మ పోషకాల కోసం పల్నా డు, గుంటూరు, బాపట్ల జిల్లాల రైతులు ఎదురు చూస్తున్నారు. సాగుకు అవసరమయ్యే యంత్ర పరికాలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల అద్దె ప్రాతిపాదికను అందుబాటులో ఉన్నా అవి అంద రికీ అందడంలేదు. ఇక రాయితీపై పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాల పంపిణీ కూడా నిలిచిపోయి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాయితీపై సూక్ష్మపోష కాలు అందజేసి రైతు లకు అండగా నిలిచేది. అయి తే వైసీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత రాయితీ అనే మాటను విస్మరించింది. యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాల పంపిణీ చేయడాన్ని విస్మరించిం ది. చివరకు టార్పాలిన్ పట్టలకు కూడా మంగళం పాడింది. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం వస్తుందని.. సాగు కష్టా లు తీరతాయని.. రైతులు ఎదురుచూస్తున్నారు.

గత ఐదేళ్లు సాగుకు ఇబ్బంది

సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. ఇవి లేనిదే వ్యవసాయ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. గత ఐదేళ్ల రాయితీ యంత్రపరికాల పంపిణీ జరగలేదు. దీంతో రైతులు సాగుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు మందు పిచికారి చేయాలంటే స్ప్రేయర్లు తప్పనిసరి. గ్రామాల్లో స్ప్రేయర్ల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు. అరకొర స్ప్రేయర్లతో మందు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల మందు పిచికారిలో జాప్యం జరిగి పంటలు దెబ్బతింటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ జరిగింది. వాటిలో ఉన్న కొన్ని స్ప్రేయర్లతోనే రైతులు ఇప్పటి వరకు నెట్టుకు వస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్లకు డిమాండ్ బాగుంది. యంత్రపరి కరాలు, రాయితీ స్ప్రేయర్ల కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు సరఫరా లేదని అధికారులు చెబుతున్నారు. ఈ సమాధానంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, పవర్‌వీడర్, ట్రాక్టర్లు ఇలా 19 రకాల యంత్రపరికరాలను రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంది. అయితే నేటి వరకు ప్రభుత్వం వీటి ఊసెత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గత కొన్ని రోజులుగా అధిక వర్షాలు రైతుల గుండెల్లో వణుకు పుటిస్తున్నాయి. కల్లాల్లో ఆరబోసిన కుప్పలు తడవకుండా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పట్టలు(టార్పాలిన్లు) అద్దెకు తెచ్చుకుని పంటలను కాపాడుకుంటున్నారు. ఈ విషయంలో మిరప రైతుల కష్టాలు చెప్పనలవి కావు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా పట్టలు పంపిణీ జరిగింది. వీటి పంపిణీని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో మిరప కల్లాల్లో ఉన్న సమయంతో వర్షాలకు తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల వద్ద పట్టలు లేక.. అద్దెకు దొరక్క మిరప, మొక్కజొన్న వంటి పంటలను కాపాడుకోలేక నష్టాలను చవిచూశారు. ప్రస్తుతం మిరప, ఇతర పంటలు చేతికి వచ్చే సమయానికి కూటమి ప్రభుత్వం పట్టలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.



మిరప కల్లాలపై కప్పే పట్టలు

సూక్ష్మ పోషకాల కోసం పాట్లు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆయా సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. ఈ సీజన్‌లో నేటి వరకు సూక్ష్మ పోషకాల పంపిణీ చేపట్టలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న పంటల నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీటి ధరలు మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పంటలకు తక్షణావసరంగా ఉన్న సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

అమరవీరుల దినానికి ఏర్పాట్లు

- పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో నిర్వహణ

బాప

ట్ల, అక్టోబరు 20 (ఆంధ్ర జ్యోతి): పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేశారు. భారీవర్షాలతో జిల్లాపోలీసు కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్‌గ్రౌండ్‌లో నీరు నిలిచింది. దీంతో ఈ ఏడాది వేదికను మార్చారు. ఈ క్రమంలో పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో వేడుకలను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో పోలీసులు ఇక్కడ పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎస్పీ తుషార్ డూడీతోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హా జరై అమరవీరులకు నివాళులు అర్పిస్తూ ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఆవాస్-2024పై ప్రాంతీయ శిక్షణ శిబిరం

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద ఆవాస్-2024 యాప్‌పై హౌసింగ్ అధికారులు, ఉద్యోగుల్లో సామర్థ్యం పెంచేందుకు ప్రాంతీయ స్థాయి శిక్షణ శిబిరం సోమవారం జరగనుంది. సోమ, మంగళవారంలో జరిగే ఈ ఉన్నతస్థాయి శిక్షణ శిబిరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ ఐఏఎస్ అధికారులు హాజరు కానున్నారు. గుంటూరు నగరంలోని రింగురోడ్డులో ఉన్న ఐటీసీ వెలకం హోటల్‌లో జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం కోసం గృహనిర్మాణ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మంగళవారం పూర్తిగా క్షేత్ర పరిశీలనకు షెడ్యూల్‌ని కేటాయించారు.

అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

నియోజకవర్గ కేంద్రం నుంచి మరో మెట్టుపైకి

అద్దంకి,

అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రెడ్డిరాజుల

రాజధానిగా.. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న అద్దంకి మరో మెట్టు పైకి అడుగు పడుతుంది. ఒకప్పుడు తాలూకా కేంద్రంగా ఉన్న అద్దంకి, మండల వ్యవస్థ వచ్చిన తర్వాత స్థాయి తగ్గి మండలానికే పరిమితమైంది. గత వైసీపీ పాలనలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. పక్క పక్కనే ఉన్న బాపట్ల, చీరాలను రెవెన్యూ డివిజన్లుగా చేసే అవకాశం ఉండదని, అద్దంకి లేదా మార్టూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని భావించారు. అయితే వాటిని పట్టించుకోకుండానే ప్రభుత్వం బాపట్ల, చీరాలతో రెండు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రేపల్లె కేంద్రంగా మరో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పాటు సమయంలో అద్దంకి నియోజకవర్గాన్ని చీరాల డివిజన్‌లో కలిపారు. అటు జిల్లా కేంద్రం, ఇటు రెవెన్యూ డివిజన్ పరంగా అద్దంకి నియోజకవర్గం దూరమైంది. అయినా గత వైసీపీ ప్రభుత్వం అద్దంకి ప్రాంతంపై చిన్న చూపే చూసిందన్న భావన ప్రజల్లో నెలకొంది.



అద్దంకి పట్టణం వ్యూ

మంత్రి దృష్టి సారించడంతో కసరత్తు మొదలు

మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను మళ్లీ ప్రకాశం జిల్లా పరిధిలో చేరుస్తామని అటు చం ద్రబాబు, ఇటు పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే కొత్త జిల్లా ఏర్పాటు ఒకింత ఆలస్యమైనా ముందుగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వైపు అడుగులు వేగంగా పడుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో డీఎస్పీ కార్యాలయం, ఆస్పత్రి స్థాయి పెంపు, ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ఎంపీడి కార్యాలయం స్థానంలో పూర్తి స్థాయిలో కార్యాలయం ఏర్పాటుపై కూడా మంత్రి గొట్టి పాటి రవికుమార్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా ఆయా కార్యాలయాలను ఏర్పాటు చేయించే ఉద్దేశంతో ఉన్నత స్థాయిలో కదలిక తెచ్చినట్లు సమాచారం.


సముద్రానికి అనకట్టగా నిలిచిన మడ అడవి

మడ.. రక్షణ కవచం

సునామీ, తుఫాన్లను ఎదుర్కొనే శక్తి

- 2018లో అంతర్జాతీయంగా గుర్తింపు
- జీవ వైవిద్యానికి నిలయం మడ అడవులు
- రేపల్లె తీరంలో అభయారణ్యంగా అభివృద్ధి

తీర ప్రాంతాన్ని సునామీ వంటి ప్రకృతి విపత్తులు నుంచి రక్షించటంతో పాటు తుపాన్ల సమయంలో పెనుగాలుల తీవ్రతను మడ అడవులు తగ్గిస్తాయి. సముద్ర ఆటుపోట్లకు భూమి కోతకు గురికాకుండా కాపాడటంతో పాటు, వన్యప్రాణులకు ఈ మడ అడవులు నెలవుగా ఉంటున్నాయి. ఉవ్వెత్తున్న ఎగసి పడే కడలి కెరటాలను దట్టంగా పెరిగిన మడ అడవులు నిలువరిస్తాయి. తీర ప్రాంతంలోని నేల కోతకు గురి కాకుండా కాపాడతాయి. నేల, నీరు సంగమ స్థలంలో అడవుల్లాగా అభివృద్ధి చెందే మడ చెట్లు రాకాసి సునామీ అలలకు అడ్డుకట్ట వేస్తాయి. దేశంలో అన్ని ప్రాంతాల్లో మడ అడవులు అంతరించిపోతున్న తరుణంలో బాపట్ల జిల్లాలో పరిధిలోని మడ అడవుల్లో అభయారణ్యంగా అభివృద్ధి చెందాయి.

రేపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తీరంలో జీవావరణానికి రక్షణగా మడ అడవులు ఉన్నాయి. బాపట్ల, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం, విశాఖ, గోదావరి జిల్లాల్లో మడ అడవులు ఉన్నాయి. కృష్ణా వైల్డ్‌లైఫ్‌లోని బాపట్ల, కృష్ణా జిల్లాలో 25 వేల హెక్టార్లలో 2000లో రూ.8 కోట్లతో అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ జాతుల మొక్కలను నాటారు. అంతర్జాతీయంగా ఎక్కడా పెరగని విధంగా కృష్ణా వైల్డ్ లైఫ్‌లో 19,481 హెక్టార్లలో ఏడు కోట్ల మొక్కలు పెరిగాయి. కృష్ణా వైల్డ్ లైఫ్‌లో ఆరు రిజర్వ్ ఫారెస్టులుగా ఉన్నాయి. బాపట్ల జిల్లా రేపల్లె మండలం లంకెవానిదిబ్బ, మోళ్ళగుంట, లక్ష్మీపురం, నక్షత్రనగర్, కొత్తపాలెం, అడవులదీవి, నిజాంపట్నం, కృష్ణా జిల్లాలోని హంసలదీవి, ఏలిచెట్లదిబ్బ, గుల్లల మోద, నాగాయలంక, సొర్లగొంది, నాచుగుంట ప్రాంతాల్లో మడ మొక్కలు పెరిగాయి. ఇవి పది నుంచి 15 మీటర్ల ఎత్తున పెరిగి దట్టంగా అడవిగా ఏర్పడ్డాయి. లైలా, ఓగ్ని, ఫైలిన్, లెనిన్, నీలం తుఫాన్లకు ఈ మడ అడవులు కారణంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో ఎలాంటి నష్టం సంభవించకుండా అడ్డుగోడగా నిలిచాయి. 2012లో సంభవించిన నీలం తుఫాన్ రేపల్లె మండలం లంకెవానిదిబ్బ సమీపంలోని మడ అడవుల మధ్య చిక్కుకుని బలహీన పడి తీరం దాటిన సంగతి విధితమే. మడ అడవుల కారణంగా వివిధ జీవ వైవిద్య జంతువులకు నిలయంగా ఉంది. భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా కాపాడుతుంది. సముద్రం నుంచి వచ్చే ఉప్పు, గాలి, నీటిని అడ్డుకుని మంచినీటిగా మారుస్తుంది. భూమికి సముద్రానికి అనుసంధానంగా ఉంది. సునామీ, తుఫాన్లకు అడ్డుకట్టగా ఉండి నేలను కోతకు గురికాకుండా చేస్తుంది. కార్బన్ కాలుష్యాన్ని మామూలు అడవుల కంటే ఐదు రెట్లు అధికంగా తగ్గించేందుకు దోహదపడుతుంది. మత్స్యసంపద అభివృద్ధికి నిలయంగా ఉంటుంది. అయితే 1972లో మడ అడవులను అప్పటి అధికారులు చెట్ల కొట్టివేతకు వేలం నిర్వహించటంతో మడ అడవులు నరికివేతకు గురయ్యాయి. దీంతో 1977 నవంబరు 19న సంభవించిన తుఫాన్ ప్రభావానికి కృష్ణా జిల్లా దివిసీమ ఉప్పెనలో కొట్టుకుపోయి వేలాది మంది మృత్యువాత పడ్డారు. గుంటూరు జిల్లా లంకెవానిదిబ్బ సమీపంలో మడ అడవులు ఉండటంతో అంత ప్రమాదం సంభవించలేదని అప్పటి రికార్డులు తెలుపుతున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..

అంతర్జాతీయంగా మడ అడవులు అంతరించిపోతు న్నాయి. అయితే మన తీరప్రాంతంలో 25 వేల హెక్టార్ల భూమి ఉండగా 19,481 ఎకరాల్లో దట్టంగా మడ అడవులు పెరిగాయి. దీంతో రేపల్లె తీర ప్రాంతంలోని మడ అడవులకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. దీంతో హైదరాబాద్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్రప్రసాద్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాల బోటనీ డిపార్టుమెంట్‌కు చెందిన డాక్టర్ ఆశాకుమారి, డాక్టర్ కరుణ మడ అడవులను 2018లో పరిశీలించారు. మడ అడవుల్లో ఆసియాలోనే ఎక్కువ రకాలు, జాతులు విస్తరించి ఉన్నాయి. మన రాష్ట్రంలోని అడవుల్లో మడ అడవులు తొమ్మిది శాతం ఆక్రమించాయి. ఉమ్మడి తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూ రు జిల్లాల్లో మాత్రమే ఇవి విస్తరించాయి. మడ అడవుల్లో 24 కుటుంబాలు, 75 జాతులు ఉన్నాయి. వీటిలో అధికసంఖ్యలో వృక్షాలు రైజోఫోరేసి కుటుంబానికి చెందినవి.


కరకట్టకు బలంగా వుండేందుకు వేళ్ళతో కమ్మేసిన మడ మొక్కలు


సముద్రంలో 20 మీటర్ల ఎత్తు ఎదిగిన మడ అడవి


బేస్తవారపేట మండలంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి

మురిసిన పల్లె ముగిసిన పండుగ

- వారం రోజులు ఉత్సాహంగా కార్యక్రమం
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు భారీగా శంకుస్థాపనలు
- మంత్రి స్వామితోసహా కీలక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం
- జోరువానల్లో సైతం పాల్గొన్న ప్రజానీకం

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో వారంరోజులపాటు ఉత్సాహంగా సాగింది. ఆదివారంతో ముగిసింది. ఈవారం రోజులపాటు తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా కొనసాగించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామితో సహా అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు తమ తమ ప్రాంతాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లోని టీడీపీ శ్రేణులు, అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధి పథకం మెటీరియల్ నిధుల అనుసంధానంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లు, నీటి సంరక్షణ, ఇతరత్రా 30వేల పనులను సుమారు నాలుగున్నర వేల కోట్లతో ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టింది. ఇందుకోసం ఈనెల 14నుంచి 20 వరకు ఊరూరా శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించి సంక్రాంతి నాటికి వాటిని పూర్తిచేయాలని నిర్దేశించింది. తదనుగుణంగా జిల్లాలో సుమారు రూ.126.19 కోట్లతో 1,168 పనులను కలెక్టర్ మంజూరు చేయగా వాటికి శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. ఈనెల 14నుంచి 20 వరకు జిల్లాలో సాగిన ఈ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తొలిరోజున కొండపి మండలం పెట్లూరులో లాంఛనంగా ప్రారంభించారు. ఇతర నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రారంభించారు.

రోజుకు రెండు,మూడు గ్రామాల్లో కార్యక్రమాలు

జిల్లాలో ఈవారం రోజులపాటు తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా రోజుకు రెండు, మూడు గ్రామాల్లో ముఖ్యనేతలు స్వయంగా శంకుస్థాపనలు, భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈనెల 18న టీడీపీ రాష్ట్రస్థాయి వర్క్ షాపును అధినేత, సీఎం చంద్రబాబు నిర్వహించగా దానికి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఆ ఒక్క రోజు మినహా ఇతర ఆరు రోజులు ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఒకట్రెండ్రోజులు ఒకరిద్దరు మినహా మిగతా వారు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే గ్రామాల్లో అభివృద్ధి పనులకు స్వీకారం చుట్టడంతో ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పాల్గొన్నాయి. అలా వారంపాటు సాగిన ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. చివరి రోజున కూడా వివిధ ప్రాంతాల్లో కీలక నేతలు పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నాగులుప్పలపాడు మండలంలోని నాగులుప్పలపాడు, అమ్మనబ్రోలు, చవటపాలెం తదితర గ్రామాల్లో పాల్గొనగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. బేస్తవారపేట మండలంలోని పలు గ్రామాల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు.

అపార నష్టం

- తెరపిచ్చిన వర్షం
- ఉరకెత్తుతున్న పంటలు
- వాయుగుండం అనంతర పరిస్థితితో రైతుల్లో ఆందోళన
- మళ్లీ వర్ష సూచనతో వణుకు

జిల్లాలో పది రోజులుగా కురుస్తున్న వర్షాలు తెరపి ఇచ్చాయి. అక్కడక్కడా ఒకట్రెండు ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల ఆదివారం ఎండ కాచింది. దీంతో పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు అంచనా వేసిన దాని కన్నా నష్టాలు అధికంగా ఉండే పరిస్థితి కనిపిస్తోంది. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనతో రైతులు వణికిపోతున్నారు. మరోవైపు వర్షాలకు అత్యధిక ప్రాంతాల్లో రోడ్లు ఛిద్రమయ్యాయి. గోతుల్లో నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా మారింది.

ఒంగోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వర్షం తెరిపి ఇచ్చి ఎండ రావడంతో పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా సజ్జ, మినుము, కంది, పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలు ఈ వర్షాలకు వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. 21 మండలాల్లోని 94 గ్రామాల్లో 3,427 మంది రైతులకు చెందిన సుమారు 4,150 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు శనివారం నాటికి అధికారులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం ఎండ కాస్తుండటంతో నష్టాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. పది రోజులుగా నీళ్లలో ఉన్న పంటలు ప్రస్తుతం ఉరకెత్తిపోతున్నాయి. పశ్చిమప్రాంతంలో పొగాకు, మిర్చి, పత్తి, కంది పంటలు దెబ్బతింటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం దాదాపు పది వేల హెక్టార్లకుపైగా పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

ఈనెలలో ఇప్పటికే 200 మి.మీ వర్షపాతం

జిల్లాలో వార్షిక వర్షపాతం 755.5 మి.మీ కాగా ఒక్క అక్టోబరులోనే 205.50 మి.మీ కురుస్తుంది. అందులో అక్టోబరు 20వరకు సుమారు 150 మి.మీ కురవాల్సి ఉండగా ఇంచుమించు 200 మి.మీ మేర పడింది. ఈనెల 14నుంచి 17 వరకూ వాయుగుండం ప్రభావం జిల్లాపై ఉండగా ఆ సమయంలోనే కాక అంతకు ముందు రెండు మూడు రోజులు, తర్వాత మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిశాయి. శుక్ర, శనివారాల్లో సుమారు 27.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో దాదాపు 17.9 మి.మీ కురిసింది. అప్పటికే జిల్లా అంతటా సాధారణం కన్నా ఎక్కువగా, కొన్ని మండలాల్లో రెండు, మూడు రెట్లు అధికంగా కురిసిన వర్షాలు పంటలను నష్టపర్చాయి. ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో జిల్లాలోనే అత్యధికంగా సింగరాయకొండ మండలంలో 65.20 మి.మీ వర్షపాతం నమోదైంది. చీమకుర్తిలో 59.0, ఒంగోలు 50.40, కొకనమిట్లలో 48.0, కొత్తపట్నంలో 44.0, పొదిలిలో 42.4 మి.మీ కురిసింది. మరో పది మండలాల్లో 15నుంచి 30 మి.మీ నమోదైంది. ఇతర ప్రాంతాల్లోనూ జల్లులు పడ్డాయి.


పొదిలి మండలం సలకనూతలలో ఉరకెత్తిన పొగాకు

రోడ్లు, పారిశుధ్యం అధ్వానం

అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు వర్షాలతో మరింత దారుణంగా మారాయి. గ్రామాలు, పట్టణాల్లోని అంతర్గత రోడ్లు చాలాచోట్ల జలమయమై కనిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై సైతం ఇప్పటికే పెద్దఎత్తున గుంతలు పడి వాటిలో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల అర్ధగంట ప్రయాణానికి గంటన్నర పడుతోంది. అదేసమయంలో పట్టణం పల్లె అన్న తేడా లేకుండా పారిశుధ్యం పరిస్థితి దారుణంగా మారింది. పట్టణాలలో ఆక్రమణలు అధికమై మురుగు అంతా రోడ్లపైకి చేరింది. పల్లెల్లో రోడ్లు, కాలువలు ఏకమై నీరుపారి దుర్గంధం వెదజల్లుతోంది. తక్షణం అధికార యంత్రాంగం పారిశుధ్యం, వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వాగులు, వంకల్లో జలకళ

జిల్లాలో చాలాకాలం తర్వాత వాగులు, వంకలు చిన్న, పెద్ద చెరువులు, కాలువలు ఇతరత్రా అన్ని నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఈ సీజన్ అవసరాలకు నీటి ఇక్కట్లు ఉండవని ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పది రోజులపాటు ముసురు వర్షంతో అవస్థలు పడిన రోజువారీ కూలీ పనులు, చిరు వ్యాపారులు చేసుకొనే వారు ప్రస్తుతం వర్షం తెరపి ఇవ్వడంతో ఆ పరిస్థితి నుంచి తేరుకుంటున్నారు. రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారు.


క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీఏ బృందం

క్రీడా రంగంలో రాజకీయ జోక్యం తగదు

- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వం రాకతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్
- ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్

పర్చూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడా రంగంలో రాజకీయ జోక్యం తగదని, గత వైసీపీ హయాంలో ఆ రంగం నిర్వీర్యమైందని ఆంధ్రా క్రికెట్ గ్రౌండ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌చార్జి అధ్యక్షుడు (ఏసీఏ) బీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పర్చూరులోని వైజంక్షన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న రుగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణాన్ని ఏసీఏ బృందం పరిశీలించింది. తొలుత ప్రాంగణంలోని వసతులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు.

క్రీడారంగం అభివృద్ధి, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్‌ను ఉండేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన ప్రతిపాదన మేరకు పర్చూరులోని క్రికెట్ క్రీడా ప్రాంగణం కోసం పరిశీలించామన్నారు. లక్షల వ్యయంతో ప్రాంగణం ఏర్పాటు చేస్తున్న ఇంటూరి వంశీని ఆయన అభినందించారు. దీనిని మరింత అభివృద్ధి చేసి జిల్లా, రాష్ట్ర, రంజీ స్థాయి పోటీలు నిర్వహించే విధంగా తమవంతు సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్ మాట్లాడుతూ పర్చూరు అంటే క్రికెట్ అన్న నానుడిని గుర్తించి వారికి మరింత ప్రోత్సాహం అందించాలన్న ఆశయంతో ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ ప్రసంశనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ కొల్లా మధు, ప్రతినిధులు సాయి కృష్ణ, సతీష్, టీడీపీ నాయకులు మక్కెన శేఖర్‌బాబు, షేక్ షంషుద్దీన్, మామిడిపాక హరిప్రసాద్, అగ్నిగుండాల వెంకట కృష్ణ, చెరుకూరి చింపయ్య (శ్రీధర్), జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, దీర్ఘాల రమేష్, తోట మణి, పర్చూరు క్రికెట్ క్లబ్ ప్రతినిధులు తులసి శ్రీనివాసరావు, రంగిశెట్టి రవికుమార్, ముత్యాల రాజేష్, కొసనా రమేష్, శివాలశెట్టి రవి, ఆకుల సురేష్, జవహర్ పాల్గొన్నారు.


శరత్‌బాబుకు పురస్కారం అందజేస్తున్న వెంకయ్య

యువ రైతుకు పురస్కారం

మార్టూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : యువ రైతుకు రైతు నేస్తం పురస్కారం లభించింది. ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తూ వ్యవసాయంలో పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన యువ రైతు పెంట్యాల శరత్‌బాబు రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. రైతు నేస్తం పత్రిక 20వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టరు ఐవీ సుబ్బారావు పేరిట వ్యవసాయ అనుబంధ రంగాలలో సేవలను అందించిన వారికి రైతు నేస్తం పురస్కారాలు-2024 పేరిట అందచేస్తున్నారు. శ్రీముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తం సంయుక్త నిర్వహణలో ఆదివారం కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో ఆత్కూరు, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పురస్కారాలను ప్రదానం చేశారు. అవార్డులను అందుకున్న 20 మంది రై తుల్లో శరత్‌బాబు ఉన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శరత్‌బాబుకు పురస్కారాన్ని అందజేశారు. కా ర్యక్రమంలో రైతు నేస్తం పత్రిక ఎడిటర్ పద్మశ్రీ పురస్కారగ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టైలర్స్ సంఘ నూతన కమిటీ ఎన్నిక

చీరాలటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం వీరరాఘవపేటలోని ఆనందమయ నిలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రతినిధులు చీరాల పట్టణ నూతన కమిటీని ఎన్నికున్నారు.అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేల్పుల వెంకటేశ్వర్లు, భాస్కరరావు, మాధవరావు, బాషా, జాన్, నసీబా, పద్మ, సుబ్రహ్మణ్యం, జిలానీ, ఉమా, ఫైసర్, సలీమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేటపాలెంలో అంతర్ కళాశాలల ఆటల పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో గుర్తింపు పొందిన 224 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బాపట్ల జిల్లా వేటపాలెంలో సోమవారం నుంచి అంతర్ కళాశాలల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్.ఐ దేవీవరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు బ్యాడ్మింటన్, షటిల్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు వేటపాలెంలోని బీబీహెచ్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఈ పోటీల్లో చెన్నై ఎస్ఆర్‌కే యూనివర్శిటీలో జరిగే అంతర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టును ఎంపిక చేస్తారు. పోటీలను యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

డబ్బు కొట్టు... లైసెన్స్ పట్టు!

- దీపావళికి బాణ సంచా విక్రయ దుకాణాలకు అనుమతుల్లో చేతివాటం
- దరఖాస్తుదారులతో రెవెన్యూ సిబ్బంది బేరాలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగకు తాత్కాలికంగా బాణసంచా విక్రయించేందుకు ఇచ్చే లైసెన్సుల విషయంలో రెవెన్యూ అధికారులు చేతివాటం చూపుతున్నారు. దరఖాస్తుదారులతో బేరాలు మాట్లాడుకొంటున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

జిల్లాలో పెద్దఎత్తున బాణసంచా విక్రయాలు

దీపావళి పండుగకు జిల్లాలో పెద్దఎత్తున బాణ సంచా విక్రయాలు జరుగుతాయి. మూడురోజులపాటు లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. బాణ సంచా విక్రయాల ద్వారా మంచి లాభాలు కూడా ఉండటంతో వ్యాపారులు లైసెన్స్‌ల కోసం పోటీపడతారు. అయితే వారంతా ముందుగా దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం మీసేవ, సచివాలయాల నుంచి పలు రకాల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకుంటారు. వీటిని పరిశీలించిన అనంతరం రెవెన్యూ అధికారులు లైసెన్సులు మంజూరు చేస్తారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 22వతేదీతో గడువు ముగుస్తుంది.

మొదలైన వసూళ్లు

రెవెన్యూ అధికారుల నుంచి లైసెన్స్ పొందిన వారు ఈనెల 29నుంచి 31వతేదీ వరకు మూడురోజులపాటు ప్రభుత్వ యంత్రాంగం గుర్తించిన ప్రదేశాల్లో బాణసంచా విక్రయించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంలో ఆర్డీవో కార్యాలయాలు కీలకంగా ఉంటాయి. ఈనేపథ్యంలో ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగులు ఇప్పటికే దరఖాస్తుదారులతో బేరసారాలు సాగిస్తున్నారు. ఆర్డీవోలు ఇటీవలనే బాధ్యతలు స్వీకరించడంతో ఆ ఉద్యోగులే అన్నీ తామై వసూళ్లను కొనసాగిస్తున్నారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు పందిళ్లపల్లి విద్యార్థులు ఎంపిక

వేటపాలెం(చీరాల), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. శనివారం త్రోవగుంట జడ్పీ హైస్కూల్‌లో అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాలబాలికల జిల్లా జట్టుకు వాయిల వెంకయ్య, వాయిల నందూరావు ఎంపికయ్యారు. వారిని స్కూల్ హెచ్‌ఎంటీ శేఖరరావు, స్కూల్ మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ సీహెచ్ రాంబాబు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.







పెరిగిన వరి సాగు

» గతంలో 500, ప్రస్తుతం 1,150 ఎకరాల్లో నాట్లు

» సాగర్ నీరు రావడంతో రైతుల మొగ్గు » కలిసొచ్చిన వర్షాలు


నాగరాజుపల్లి పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

మార్టూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మండలంలో వరి సాగు పెరుగుతున్నది. సాగర్ కాలువ రావడంతో రైతులు వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్‌లో 1150 ఎకరాలలో వరి సాగుచేపట్టారు. గత సీజన్‌లో ఖరీఫ్‌లో కేవలం 400 నుంచి 500 ఎకరాలను మాత్రమే సాగుచేశారు. ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలో సాగర్ కాలువ సమీపంలో ఉన్న గ్రామాలైన బొల్లాపల్లిలో 150, కోలలపూడిలో 200, ఇసుకదర్శిలో 200, జొన్నతాళిలో 100, ఇంకా వలపర్ల, నాగరాజుపల్లి, తాటివారిపాలెం, చిమ్మిరిబండ, ద్రోణాదుల తదితర గ్రామాలలో వరి పంట సాగు చేపట్టారు. ప్రస్తుతానికి సాగర్ కాలువ రావడంతోపాటు వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాది మండలంలో సుమారు 4500 ఎకరాలలో సాగు చేయగా, ప్రస్తుతం 10వేల ఎకరాలలో సాగుచేసే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ఇసుకదర్శి లాంటి గ్రామాలలో గత ఏడాది మొక్కజొన్న సాగుచేసిన పొలాల్లో ఈ ఏడాది మాగాణి పంటను సాగుచేయడం విశేషం. మరి కొన్ని గ్రామాలలో మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా మాగాణిని సాగు చేస్తున్నారు. గత ఏడాది మొక్కజొన్న రైతులు నష్టపోలేదు.

ఉద్యాన పంటలకు ఊపిరి

వారం రోజులుగా కురిసిన వానలు మండలంలో ఉద్యాన పంటలకు ఊపిరినిచ్చాయి. మిరప, దోస, మునగ, వంకాయ, కాకర, టమాటా, చిక్కుళ్లు తదితర కూరగాయలకు నీటి వసతిలేక ఎండిపోయేదశకు చేరాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు బతికాయని రైతులు చెప్తున్నారు. మండలంలో బొబ్బేపల్లి, నాగరాజుపల్లి, వలపర్ల, కోలలపూడి, ఇసుకదర్శి, రాజుగారిపాలెం, ద్రోణాదుల గ్రామాలలో కూరగాయలు సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. మిరప మొక్కలు కూడా కళకళలాడుతున్నాయి.

పర్చూరులో భారీ వర్షం

పర్చూరు, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో ఆదివారం కురిసిన భారీ వర్షంతో రహదారులు, పంట పొలాలు జలమయమయ్యాయి. కుండపోతగా కురవడంతో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

పల్లె రహదారులకు మోక్షం


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

పంగులూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ కార్యక్రమాలతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందని ఎంపీడీవో కే స్వరూపారాణి అన్నారు. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంగులూరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, గోకులాల షెడ్లకు అధికారులు, ప్రజా ప్రతినిధులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, కార్యదర్శి బీ రాంబాబు, ఈసీ మురళి, సుబ్బారావు, బాచిన చౌదరిబాబు, జాగర్లమూడి సుబ్బారావు, రామారావు, సురేష్, నాగేశ్వరరావు, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి


కారంచేడులో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

కారంచేడు : పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు సంతరించుకుంటాయని టీడీపీ నాయకులు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కారంచేడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రంలో భాగంగా గ్రామంలోని రెండు ప్రధాన మంచినీటి చెరువుల మధ్య సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఈవోఆర్డీ రమేష్‌బాబు, టీడీపీ నేతలు పోతిని ఉదయ్, నల్లగొర్ల శ్రీరాములు, జాగర్లమూడి ప్రహ్లాద, హుస్సేన్, చాగంటి లక్ష్మీన్నారాయణ, ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మౌలానగర్‌లో బురదగా ఉన్న రోడ్డు

అభివృద్ధికి నోచుకోని శివారు కాలనీలు

అవస్థలు పడుతున్న స్థానికులు

అద్దంకి, అక్టోబరు 20 (ఆం ధ్రజ్యోతి) : అద్దంకి పట్టణం లోని పలు శివారు కాలనీలలో అభి వృద్ధి పనులు జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైసీపీ పాల నలో అద్దంకి పట్టణంలోని సీసీ రోడ్ల ఏర్పాటుకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. మున్సిపాలిటీలోని సాధారణ నిధులతో కొద్దిమేర మాత్రమే పనులు చేపట్టారు. దీంతో అత్యధిక శాతం శివారు ప్రాంతాలలో అభివృద్ధి పనుల ఊసేలేదు. దీంతో ఉన్నపాటి మట్టి రోడ్లు ఛిద్రమయ్యాయి. చిన్నపాటి వర్షం పడ్డా రోడ్లపై నడిచే పరిస్థితి లేకుండా పోయింది. ఇక సైడ్ డ్రైన్‌లు కూడా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పైనే నిలిచి ఉంటుంది. ప్రధానంగా మౌలానగర్, గరటయ్య కాలనీ, ఎన్టీఆర్ నగర్, నాగులపాడు రోడ్డులోని పలు వీధులు బురదమయంగా మారుతున్నాయి. రాత్రి సమయంలో ప్రజలు మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతాయన్న ఆశతో ఆయా కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు. సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


యర్రబాలెం రోడ్డు పక్కన ఉన్న నేలబావి

చెరువు.. నేలబావి.. మధ్యలో రోడ్డు

భయపడుతూనే ప్రయాణం

మేదరమెట్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చెరువు, నేలబావి మధ్య ఉన్న రోడ్డులో యర్రబాలెం వాసులు నిత్యం భయపడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. సుమారు 1700 జనాబా ఉన్న యర్రబాలెం గ్రామస్థులు నిత్యం ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటారు. ప్రతి చిన్న పనికీ గ్రామస్థులు నిత్యం మేదరమెట్లకు వస్తుంటారు. పలువురు యువకులు, ఉపాధి కోసం వచ్చేవారు ఎక్కువే. వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పురుగు మందుల లోడుతో వెళ్లే వాహనాలు కూడా ఆ రోడ్డులోనే వెళ్తాయి. రాత్రి సమయంలో ఈ రోడ్డులో ప్రయాణించే వారు ఒక పక్క చేరువు, మరో పక్క నేల బావి ఉండడంతో నిత్యం ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఈ బావికి కనీసం గోడ కూడా కట్టలేదు. ఇప్పటికైనా ఇబ్బంది పడకుండా ప్రయాణించేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శ్రీను కుటుంబ సభ్యులకు పరామర్శ

వేటపాలెం(చీరాల), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ చిమటా సాంబు ఆదివారం పరామర్శించారు. వారికి అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీను మృతిపై ఉన్న అనుమానాలను పోలీస్‌శాఖ త్వరితగతిన నివృత్తి చేయాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలి

చీరాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురంలోని వైసీపీ క్యాంప్ కార్యాలయానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సోమవారం ఉదయం రానున్నారు. ఉదయం 10 గంటల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాపట్లలో వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారానికి హాజరవుతారు. నాయకులు, కార్యకర్తలు ఉదయం 10 గంటలకు క్యాంపు కార్యాలయానికి రావాలని కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భరద్వాజకు ఘన నివాళి


రావూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ 11వ వర్ధంతిని ఆదివారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు ముందుగా రావూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పదవ తరగతి మాత్రమే చదువుకుని నిత్య సాహిత్య కృషితో అవార్డును అందుకోవడం భరద్వాజ పట్టుదలకు నిదర్శనమని వారు కొనియాడారు. అనంతరం ప్రముఖ కవి, గేయ రచయిత కర్ణ సుబ్బారావుకు డా.రావూరి భరద్వాజ సాహితీ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బత్తుల బ్రహ్మారెడ్డి, నాగవీర భద్రాచారి, రాఘవేంద్ర, కట్టా రాజ్ వినయ్‌కుమార్, రాధాకృష్ణ, ఏకాంబరేశ్వరబాబు, హరిహరరావు, రామారావు, లక్ష్మణాచారి, హరిహర ప్రసాద్, శివాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి నేడు శంకుస్థాపన

ఎన్‌ఆర్‌ఐల సహకారంతో నిర్మాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఏర్పాటు చేసిన షెడ్

అద్దంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : చినకొత్తపల్లి వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వా మి ఆలయాన్ని నిర్మించనున్నారు. శ్రీయాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐల సహకారంతో మండలంలోని చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద నామ్ రోడ్డు వెంబడి భారీ వ్యయంతో కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం ఉదయం 9-10 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని ట్రస్ట్ ఫౌండర్, ఎన్‌ఆర్‌ఐ దేవినేని శ్రీకాంత్ తెలిపారు. అనంతరం 9-30 గంటల నుంచి స్వామి వారి కల్యాణం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. స్వామి వారి కల్యాణం జరిగే ప్రాంతంలో వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా రేకులతో తాత్కాలిక షెడ్‌ను ఏర్పాటు చేశారు.





ఓ వైపు కృష్ణపట్నం పోర్టు, మరోవైపు రామాయపట్నం పోర్టు... ఇంకోవైపు క్రిస్‌సిటీ... మరో వైపు చెన్నై-విశాఖ కారిడార్... వీటి మధ్యన నెల్లూరు జిల్లా. పారిశ్రామికంగా ఎంతో పురోభివృద్ధి సాధించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఏపీఐఐసీ పనితీరు ఆ అవకాశాలను నాశనం చేస్తోంది. పారిశ్రామికీకరణలో కీలకమైంది ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్(ఏపీఐఐసీ). కొత్తగా ఏ చిన్న పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నా, ఈ సంస్థే భూమిని కేటాయించాల్సి ఉంది. అయితే జిల్లాలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో బంతాట ఆడినట్లు జోనల్ కార్యాలయాన్ని ఓ సారి ఒంగోలుకు, తరువాత నాయుడుపేటకు, చివరకు నెల్లూరుకు మార్చారు. పోనీ ప్రభుత్వం మారిన తరువాత అయినా ఈ వ్యవస్థ గాడిన పడుతుందనుకుంటే మళ్లీ పాతపోకడలే కొనసాగుతున్నాయి.



నెల్లూరు ఏకే నగర్‌లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం

- భర్తీ కాని కీలక పోస్టులు
- నియామకంపై దృష్టి సారించని అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలోనే నాశనం
- పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం
- నెల్లూరంటే ఎందుకంత చిన్నచూపు ?

ఏపీఐఐసీలో కుర్చీల ఖాళీ

నెల్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో కీలక పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులందరినీ బదిలీ చేశారు. అయితే ఆ స్థానంలో కొత్తగా ఏ ఒక్కరిని నియమించలేదు. దీంతో ఇప్పుడు నెల్లూరు జోనల్ కార్యాలయం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తోంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, కనీసం గైడ్ చేసేవారు కరువయ్యారు.

● సీట్లన్నీ ఖాళీనే..

నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో కీలక సీట్లు ఖాళీ అయిపోయాయి. జోనల్ మేనేజర్ (జడ్ఎం)సీటు చాలాకాలం నుంచి ఇన్‌చార్జిల పాలనలో సాగుతోంది. ఇటీవల బదిలీల్లో కూడా ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. డీజెడ్ఎం(డిప్యూటీ జోనల్ మేనేజర్)ఫైనాన్స్, డీజెడ్ఎం అసెట్స్ మేనెజ్‌మెంట్, డీజెడ్ఎం ఇంజనీరింగ్(నెల్లూరు, నాయుడుపేట రెండు పోస్టులు), మేనేజర్ అసెట్స్ మేనెజ్‌మెంట్, మేనేజర్ ఇంజనీరింగ్ పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులను ఇటీవల ఒక్కసారిగా బదిలీచేశారు. ఈ స్థానాల్లో ఒక్కరిని కూడా ఇంతవరకు నియమించలేదు. గతంలో కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తుండగా, జీతాలు రాక మానేశారు. ప్రస్తుతం ఒకే ఒక్క డీజెడ్ఎం ఉండడం, ఆయనే ఇన్‌చార్జి జెడ్ఎం కావడం గమనార్హం. కాగా ఈనెల జీతాలు పెట్టేందుకు కూడా సంబంధిత అధికారులు లేరంటూ ఆ శాఖ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో బంతాట

రాష్ట్రంలో విశాఖపట్నం తరువాత పారిశ్రామికంగా, వేగంగా వృద్ధి చెందుతున్న ప్రాంతం ఉమ్మడి నెల్లూరు జిల్లానే. ఇప్పటికే ఉన్న కృష్ణపట్నం పోర్టుకుతోడు కొత్తగా రామాయపట్నం పోర్టు చేరింది. ఇంతటి కీలకమైన నెల్లూరు జిల్లాలో ఏపీఐఐసీ విభాగంతో వైసీపీ ప్రభుత్వం బంతాట ఆడుకుంది. జిల్లాల పునర్విభజన తరువాత నెల్లూరు జోనల్ కార్యాలయాన్ని రద్దుచేసింది. నెల్లూరును సబ్‌జోన్‌గా మార్చి ఒంగోలు జోనల్ కార్యాలయం కిందకు చేర్చింది. ఈ విషయమై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఒంగోలు నుంచి కాస్త నాయుడుపేట స్పెషల్‌జోన్ కిందకు

- మిగతా 6లో..

చుక్కల భూముల చిక్కులు తొలగేదెప్పుడు !

- కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- రెవెన్యూ శాఖలో ప్రక్రియ పూర్తి
- జేసీ లాగిన్లో ఆగి ఉన్న ఫైళ్లు

అల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర దశాబ్ద కాలం నుంచి ఇబ్బంది పెడుతున్న చుక్కల భూముల సమస్య తీరేది ఎప్పుడంటూ అంటూ రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తొలుత ఈ సమస్య తొలుత ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే ప్రారంభమైనా నేటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రారంభమైన ఈ సమస్య ఉమ్మడి రాష్ట్ర మంతటా ఉత్పన్నమైంది. రాష్ట్ర విభజన జరిగినా కూడా చుక్కల భూముల సమస్య తీరలేదు.

● చుక్కల భూములు అంటే...

చుక్కల భూములంటే బ్రిటీష్ హయాంలో తొలిసారిగా చేపట్టిన భూసర్వేలో అనుభవంలో ఉన్న రైతుల పేర్లు నమోదు చేయడం, ప్రభుత్వం ఆధీనంలో ఉండే భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించడం, ఇనాం ఇచ్చిన వారికి ఇనాంగానూ అసలు ఎవరు అనుభవంలో ఉన్న విషయం తెలియక చుక్కలు పెట్టడం చేశారు. దీన్నే ఆర్ఎస్ఆర్ (డైగ్లాట్) అని కూడా అంటారు. ఈ ప్రక్రియలో పెట్టిన చుక్కలే నేడు రైతులకు సమస్యగా మారాయి. అప్పటి నుంచి ఆర్ఎస్ఆర్‌లో చుక్కలు కలిగిన భూములను పట్టా భూములతోపాటు రిజిస్ట్రేషన్లు చేస్తూ వచ్చారు.

● సమస్య ఉత్పన్నమైందిలా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఒకటిన్నర దశాబ్దం క్రితం జేసీగా పనిచేసిన ఓ అధికారి ఈ చుక్కలు ఉండే భూములు ఉండే పట్టికలో రైతుల పేర్లు లేనందున వీటిని ప్రభుత్వ భూములుగా పరిగణించాలంటూ ప్రకటన చేశారు. ఆ ప్రకటన ఆధారంగా చుక్కలు ఉన్న భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ 22-ఏలో నమోదు చేశారు. దీంతో వేలాది ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లను అర్థంతరంగా నిలిపివేశారు. ఈ భూములకు పరిష్కారాన్ని చూపించాలని 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. భూముల రికార్డులను, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను, లింకు డాక్యుమెంట్లను అనుభవకాలం 12 దాటి ఉండడం, తదితర వాటిని పరిశీలించి పూర్తిస్థాయిలో అనుభవంలో ఉన్న వారికి పట్టా భూములుగా మార్పు చేసేలా కార్యాచరణ చేపట్టింది. దీని కోసం సుమారు మూడేళ్ల కాలం పట్టింది. అన్ని చక్కదిద్దే క్రమంలో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. వైసీపీ ప్రభుత్వం నూతన ప్రక్రియగా చుక్కల భూముల సమస్యను తీసుకొచ్చి జేసీ ఆధ్వర్యంలో ప్రక్రియను చేపట్టింది. పట్టాగా మార్పు చేసే క్రమంలో సర్వేనెంబర్లు జేసీ లాగిన్లోకి వెళ్లి అక్కడి నుంచి అనుమతులు పొంది జిల్లా రిజిస్ట్రారు కార్యాలయానికి చేరుకుంటే అక్కడ 22-ఏ (నిషేధిత భూమి జాబితా)లో నుంచి తొలగించేలా కార్యాచరణ రూపొందించింది.

● ఇక్కడే అసలు సమస్య

జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం నుంచి చుక్కల భూములుగా నమోదు చేయబడిన సర్వేనెంబర్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాల్సిన బాధ్యత రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించింది. ఈ శాఖ ద్వారా అన్నీ సర్వేనెంబర్లు పూర్తిస్థాయిలో సదరు జాబితా నుంచి తొలగించి

- మిగతా 6లో..



అట్టముక్కలతో రూపొందించిన జాతీయ చిహ్నం

అద్భుతం... ఆ కళాఖండాలు !

అట్టముక్కలతో అద్భుతాలు సృష్టించడం నెల్లూరు నగరంలోని కిడాంబి నరసింహన్‌కి వెన్నతో పెట్టిన విద్య.ఆయన సృష్టించిన కళాఖండాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. నగరంలో ప్రసిద్ధి చెందిన 'సంతానం బుక్ స్టాల్' అధినేతగా ఆయన పాత పుస్తకాల వ్యాపారం చేస్తున్నా, ప్రవృత్తిగా చిత్రలేఖనంపై దృష్టి సారించి, దేవతామూర్తుల చిత్రాలను అద్భుత కళాఖండాలుగా రూపొందిస్తున్నారు.

- వివరాలు 6లో..

జడ్పీ ఉద్యోగ బదిలీలపై రివైజ్డ్ అఫిడవిట్

● ప్రస్తుత కేసును ఉపసంహరించుకున్న చైర్‌పర్సన్

నెల్లూరు జడ్పీ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జడ్పీలో ఉద్యోగుల బదిలీలపై న్యాయస్థానంలో కేసులు కొనసాగుతున్నాయి. తన అనుమతి లేకుండా జడ్పీలో ఉద్యోగులను అధికారులు ఇష్టానుసారంగా బదిలీ చేశారని హైకోర్టులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని న్యాయ స్థానం అధికారులను ఆదేశించింది. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ అనుమతితోనే బదిలీలు జరిగాయని, అందుకు సంబంధించిన పత్రాలను అధికారులు కోర్టుకు సమర్పించారు. దీంతో తాము తొలుత ఇచ్చిన రఫ్‌నోట్‌ను అధికారులు న్యాయస్థానానికి అందజేసి తప్పుదోవ పట్టిస్తున్నారని, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొంటూ రివైజ్డ్ అఫిడవిట్‌ను సోమవారం హైకోర్టులో వేయనున్నారు. కాగా ప్రస్తుతం వేసిఉన్న పిటిషన్‌ను ఆమె ఉపసంహరించుకున్నారు. దీంతో బదిలీల కేసు మళ్లీ కొనసాగనుంది.

శివా.. దారిచూపవా ?

సీతారామపురం మండలం దేవమ్మచెరువు పంచాయతీ పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరానికి వెళ్లేందుకు భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈ క్షేత్రంలో పరమశివుడు, పార్వతీదేవి నక్క వాహనంపై కొలువుతీరి ఉంటారు. కోరిన కోర్కెలు తీరుతాయనే ప్రగాఢ నమ్మకంతో ఏడాది పొడవునా ఇక్కడకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. కార్తీకమాసం, మహాశివరాత్రి సమయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ క్షేతానికి వెళ్లేందుకు ఇదిగో ఇలా ఉంది రహదారి. వర్షాలు పడితే మట్టి రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి బురదమయంగా మారుతుంది. కార్తీకమాసం ప్రారంభమయ్యేలోగా ఈ రహదారిని బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



అధ్వానంగా ఉన్న సిద్దేశ్వరం క్షేత్రానికి వెళ్లే రహదారి



గండిపాళెం జలాశయంలో చేరిన వరద నీరు

'రాళ్లపాడు'లో పెరుగుతున్న నీటిమట్టం

- ప్రాజెక్టులో 16.2 అడుగులకు చేరిన నీరు
- 'గండిపాళెంలోనూ వరద నీరు చేరిక
- సోమశిలకు తగ్గిన ప్రవాహం

- వివరాలు 6లో..



రాళ్లపాడు ప్రాజెక్టులో 16.2 అడుగులకు చేరిన నీటిమట్టం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు

నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవం ఆదివారం పురమందిరంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు, ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా ఈ కార్యక్రమాలు జరగ్గా, చివర్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)

బోగస్ హాజరుపై దృష్టి

పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై ప్రభుత్వం దృష్టి సారించింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, హాజరు అవకతవకలను గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. ఇప్పటి వరకు సాగిన అడ్డగోలు వ్యవహారం, ఇక సాగకుండా అడ్డుకట్ట వేసేలా తనిఖీలను ముమ్మరం చేయనుంది. దీంతో తమ అక్రమాలు వెలుగులోకి వస్తాయన్న భయంతో ఎయిడెడ్ విద్యాసంస్థల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

- ఇకపై పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- విద్యార్థుల నమోదు వివరాలపై ఆరా
- అక్రమాలు వెలుగులోకి వస్తాయని 'ఎయిడెడ్' నిర్వాహకుల ఆందోళన



నెల్లూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,688 ప్రాథమిక, 361 ప్రాథమికోన్నత, 418 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,467 ప్రభుత్వ బడులున్నాయి. వీటిలో 3.28 లక్షలమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొన్నటి వరకు హాజరుపట్టికలో పేరు నమోదుకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. వాస్తవంగా నమోదైన ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా బడి మెట్లు మాత్రం ఎక్కడంలేదు. దీంతో హాజరుశాతం చాలా తక్కువగా ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు తక్కువశాతం మంది హాజరవుతున్నా, 90 నుంచి 95శాతం మంది హాజరువుతున్నట్లు తప్పుడు సమాచారం నమోదు చేస్తున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయిలో ఎందుకిలా జరుగుతోందని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. రిజిస్టర్‌లో పేరు ఉన్నా, పాఠశాలలకు మాత్రం విద్యార్థులు రావడం లేదు.

తరగతి గదిలోకి వచ్చి పాఠాలు వినడంలేదని గుర్తించారు. దీనిపై ఉన్నత స్థాయిలో కసరత్తు చేయగా, అధిక ప్రాంతాల్లో బోగస్ బాగోతం సాగుతోందని ప్రాథమికంగా నిర్ధారించారు. విద్యార్థుల సంఖ్య కోసం అడ్డగోలుగా ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వెంటనే ఆకస్మిక తనిఖీలు చేపట్టి లోపాలను గుర్తించాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే దీనిపై ఎంఈవోలతో సమీక్ష నిర్వహించి వారం, పదిరోజుల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించి వాస్తవ నివేదికలు ఇవ్వాలని ఎంఈవోలకు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను కచ్చితంగా సందర్శించి బోగస్‌ను అరికట్టాలని స్పష్టమైన ఉత్తర్వులిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు, హాజరు పట్టికలో ఉన్న పేర్లకు చాలా వ్యత్యాసాలున్నట్లు ఇప్పటికే ఆరోపణలున్నాయి. హాజరు పట్టికలో పేరున్న ప్రతి విద్యార్థి బడిలో ఉండడంతో పాటు యూడైస్‌లో కచ్చితంగా నమోదై ఉండాలి. అయితే ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి అధికంగా రాజకీయ ఒత్తిళ్లను అధిగమించాల్సి ఉంటుందని ఓ అధికారి చెప్పడం విశేషం.

● ఎయిడెడ్‌లో విచారణ జరిగేనా ?

ఎయిడెడ్ పాఠశాలల్లో విచారణ సవ్యంగా జరిగేనా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాల బోధనకు పలు ఇబ్బందులు వస్తున్నాయని యాజమాన్య ప్రతినిధులు గత వైసీపీ ప్రభుత్వంలో ఖాళీల భర్తీకి అనుమతులు తెచ్చుకున్నారు. దీంతో ఈ నియామకాల్లో పెద్ద ఎత్తున లాబీయింగ్‌లతో పాటు లావాదేవీలు కూడా భారీగానే జరిగినట్లు బహిరంగ చర్చ జరిగింది. ఇది అందరికీ తెలిసినా రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగా అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అక్షర సత్యం.ఇక బడిలో ప్రవేశం పొందిన విద్యార్థులు వస్తున్నారా.... లేదా ? అని తనిఖీలు చేసే పరిస్థితి ఉంటుందా..? అని విద్యాశాఖ సిబ్బంది తమ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం ఎయిడెడ్ విద్యాలయాలకు వెళ్లి ఒకసారి కాకుండా ఆకస్మికంగా మూడుసార్లు వేర్వేరుగా తనిఖీలు చేయాలని, లోపాలను గుర్తించి వాస్తవ నివేదికలను ఇవ్వాలని ఆదేశించారు. అయితే అధికారులు ఒత్తిడిని తట్టుకుని సమగ్రంగా వాస్తవ నివేదికలు ఇస్తారా ? లేక అంతా బాగుందని గతంలో మాదిరిగా సమాచారం అందిస్తారా ..? అన్న చర్చ జోరుగా సాగుతోంది..



తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రముఖుల నుంచి అవార్డు అందుకుంటూ..

నాట్య రంజని భవ్యహాసిని

- భరతనాట్యంలో ఎన్నో సాహసోపేత ప్రదర్శనలు
- పలు రికార్డులు, అవార్డుల సొంతం
- చదువుల్లోనూ మేటి, కరాటేలోనూ రాణింపు

భరతనాట్య కళాకారిణిగా నెల్లూరు నగరానికి చెందిన నల్లంగు భవ్యహాసిని అసమాన ప్రతిభ కనబరుస్తోంది. ఆధ్యాత్మిక చింతన కలిగిన ఆమె పలు ఆలయాల సన్నిధిలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి 14ఏళ్లకే పలు ప్రపంచ రికార్డులు సాధించింది. ప్రస్తుతం ఆమె నగరంలోని అవెన్యూ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 9వతరగతి చదువుతోంది. ఊహ తెలిసిన నాటి నుంచి భవ్యహాసినిలో దైవభక్తి, నాట్యం పట్ల ఆసక్తి కనపరచడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు 2వతరగతిలోనే నృత్యశిక్షణకు పంపారు. కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేతలు ఈకే.కామాక్షి, ఈకే.సుబ్రహ్మణ్యం వద్ద భరతనాట్యంలో ఏడేళ్ల శిక్షణ పొందారు. భరతనాట్యంలో మెలకువలు వంట పట్టించుకున్న భవ్యహాసిని శిక్షణ సమయంలోనే నృత్య ప్రదర్శనలు చేయాలని సంకల్పించింది. ఆమె సంకల్పానికి తల్లిదండ్రులు, నాట్యగురువులు ప్రోత్సహించారు. దీంతో ఆమె పలు ప్రముఖ ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చింది.

● గంటల తరబడి ఏకధాటిగా ప్రదర్శన

మూడు గంటలసేపు నిర్విరామంగా నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. దేవరపాలెం నరసింహకొండకు పైనుంచి కిందికి, కింది నుంచి పైకి మూడుసార్లు నృత్య ప్రదర్శనను సాహసోపేతంగా ప్రదర్శించింది. అలా ఆమె తన నాట్యంతో నరసింహ స్వామికి కళానీరాజనం అర్పించింది. అనంతరం నెల్లూరు పురమందిరంలో నిరంతరాయంగా నాలుగు గంటలసేపు నృత్య ప్రదర్శన చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. 2023లో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ఒకటిన్నర గంటలపాటు నృత్య ప్రదర్శన చేసి నటరాజ స్వామికి నృత్య నీరాజనం అర్పించింది. తమిళనాడులోని అరుణాచలంలో 14కి.మీల దూరం నృత్య ప్రదర్శనలు చేస్తూ గిరి ప్రదక్షిణ చేసింది. ఈ సందర్భంగా ఆమె పాదాలకు గాయాలయ్యాయి. అయినా వెరవక కఠోరదీక్ష, ఎనలేని భక్తిభావంలో 14 కి.మీల దూరం నృత్య ప్రదర్శనలను 3.36 గంటల్లో పూర్తి చేసింది. అరుణాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా నృత్య ప్రదర్శనలో పలువురు భక్తులు కూడా నృత్యాలు చేస్తూ ఆమెను ప్రోత్సహించారు.

● ఎన్నో అవార్డులు, రివార్డులు

భరతనాట్యంలో భవ్యహాసిని ఎన్నో రికార్డులు, అవార్డులు సాధించారు. గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా వరల్డ్ బుక్, నోబుల్ వరల్డ్ రికార్డులు ఆమెకు వచ్చాయి. 2023 అక్టోబరు 2న జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారు నెల్లూరు టయో అవార్డుని ఇచ్చి సత్కరించారు. 2024 జనవరి 26గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ నాట్యకారిణి ప్రశంసాపత్రం అందుకుంది. ఇదే స్ఫూర్తితో 2024లో మాలకొండకు భరతనాట్యం చేసుకుంటూ చేరుకుంది. ఎంతో దీక్షాదక్షతలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రికి భరతనాట్యం చేసుకుంటూ చేరుకుంది. 2024 ఆగస్టులో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన నృత్యకారంలో శ్రీకృష్ణదేవరాయ సమితివారు భవ్యహాసినిని నాట్యరంజిత బిరుదుతో సత్కరించారు. ఆమె నాట్యంతోపాటు చదువుల్లోనూ మేటిగానే ఉంది. అలాగే కరాటేలో బ్రౌన్-3 బెల్ట్ సాధించింది. గూడూరులో హిందూ ధర్మప్రచార సమితి నిర్వహించిన భగవద్గీతల శ్లోకాల పోటీలో కూడా మండల స్థాయి ప్రథమ బహుమతి సాధించింది.

- నెల్లూరు, సాంస్కృతికం (ఆంధ్రజ్యోతి)


లక్ష్మీ అలంకారంలో భవ్యహాసిని

హిందూ సంస్కృతిని విశ్వవ్యాప్తి చేయాలని...

నా తల్లిదండ్రులు చెంచులక్ష్మి, ఎస్.సునీల్, నాట్యాచారులు ఈకే.కామాక్షి, సుబ్రహ్మణ్యం, అవెన్యూ స్కూలు యాజమాన్యం ప్రోత్సాహంతో భరతనాట్య కళాకారిణిగా గుర్తింపు పొందా. వారి స్ఫూర్తి, ఆశీస్సులతో భరతనాట్యం విశిష్టతను, హిందూ సనాతన ధర్మం గొప్పదనాన్ని, సంస్కృతిని విశ్వవ్యాప్తి చేయాలన్నదే తన ఆశయం.

- నల్లంగు భవ్యహాసిని

చుక్కల భూముల చిక్కులు తొలగేదెప్పుడు !

(5వ పేజీ తరువాయి)

పట్టా భూములుగా చలామణి అయ్యే పరిస్థితిని కల్పించాల్సి ఉండగా కొన్నింటినే తొలగించడంతో అదే సమస్యగా కొనసాగుతోంది. దీంతో వేలాది ఎకరాలు నిషేధిత భూముల జాబితాలో ఉండిపోయాయి. దీనికి పూర్తిస్థాయిలో పరిష్కారాన్ని చూపించాలని రైతులు కోరుతున్నారు.



పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలి

కూటమి ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి సమస్యను పరిష్కరించుకునే పరిజ్ఞానం లేని రైతుల కోసం పూర్తిస్థాయిలో ఈ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలి

- గోళ్ల ఆదాం, రైతు, గోగులపల్లి



అవసరమైనప్పుడు అమ్ముకోలేని దుస్థితి

చుక్కల భూముల సమస్య తీరిపోయిందని రెవెన్యూ అధికారులు చెప్తున్నా, ఎంతోమంది రైతులను ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. అవసరమైనప్పుడు ఈ భూములను విక్రయించుకోలేని పరిస్థితి నేడు నెలకొంది.

-గంగపట్నం శీనయ్య, రైతు, ఇస్కపలి

ఏపీఐఐసీలో కుర్చీల ఖాళీ

(5వ పేజీ తరువాయి)

నెల్లూరు జిల్లాను మార్చారు. దీనిపై కూడా పారిశ్రామికవేత్తలనుంచి విమర్శలు వెల్లువెత్తడంతో మళ్లీ నెల్లూరుకు తిరిగి తీసుకువచ్చి జోనల్ కార్యాలయాన్ని పునరుద్ధరించారు. ఈ ప్రక్రియ పారిశ్రామిక విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. నెల్లూరు జోన్‌ను పునరుద్ధరించినా రెగ్యులర్ జెడ్ఎంను నియమించకుండా వైసీపీ ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. దీన్ని బట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వానికి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

● కీలక సమయం

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక రంగంపై దృష్టి సారించింది. కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు బహుశా అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటూ ఓ వైపు సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే చెపుతూ వస్తున్నారు, నూతన ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. ఇదే సమయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఏటా 15శాతం గ్రోత్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు జిల్లాలో కృష్ణపట్నం స్మార్ట్‌సిటీ (క్రిస్‌సిటీ) నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. వీటన్నింటి నడుమ కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఈ సమయంలో ఏపీఐఐసీ కీలకంగా వ్యవహరిస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు లేకుండా, వేగంగా భూములు ఇవ్వగలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చు. అయితే అందుకు పూర్తిస్థాయిలో ఏపీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని పటిష్టం చేయాల్సి ఉంది. ఈవిషయంపై జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు, కలెక్టర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.




అట్టముక్కలతో రూపొందించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలు, వినాయకుడి విగ్రహం, శ్రీజ్వాలాముఖి అమ్మవారి విగ్రహం

అట్టముక్కలతో అద్భుతాలు !

'కిడాంబి' కళాఖండాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తితో ఆయన సృష్టించిన అద్భుతాలకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కింది. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనేందుకు ఇది ఒక నిదర్శనం. నెల్లూరు నగరానికి చెందిన పాత పుస్తకాల విక్రయశాల 'సంతానం బుక్ స్టాల్' అధినేత కిడాంబి నరసింహన్ తన తండ్రి కాలం నుంచే పాత పుస్తకాల వ్యాపారం చేస్తున్నా, ప్రవృత్తిగా చిత్రలేఖనంపై దృష్టి సారించారు. కళాత్మక నైపుణ్యం ఉట్టిపడేలా దేవతామూర్తుల చిత్రాలను అద్భుతంగా వేయడంతోపాటు మంచి కళాఖండాలను రూపొందించేవారు. సొంతంగానే చిత్రలేఖనంపై మంచి పట్టు సాధించి చిత్రకారుడిగా, శిల్పిగా గుర్తింపు పొంది పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఆయన గీసిన చిత్రాలకు రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు దక్కాయి. శిల్పకళలో కూడా ప్రవేశమున్న నరసింహన్ అట్టముక్కలతో 2.5 అడుగుల ఎత్తు, 18 కిలోల బరువుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను అద్భుతంగా తయారు చేశారు. ఈ విగ్రహాల తయారీకి ఆరు నెలల సమయం పట్టింది. అదే అట్టముక్కలతో కళ్ల మెరిసేలా శ్రీవారి వజ్రాభరణాలు, 20 కిలోల అట్టలతో శ్రీవారి సుదర్శన చక్రాన్ని తయారు చేసి మెప్పించారు. ఇవి చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. వీటితోపాటు గణనాథుడు విగ్రహం, జ్వాలాముఖి అమ్మవారి చిత్రపటం రూపొందించారు.

● జాతీయ చిహ్నం..

మూడు నెలలు శ్రమించి రెండు అడుగుల ఎత్తులో భారతదేశ జాతీయ చిహ్నాన్ని సైతం అట్టముక్కలతో తయారు చేశారు.

● త్యాగరాజస్వామి విగ్రహ రూపకల్పనకు..

నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవ సభకు వచ్చే ఏడాదితో 60 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా అట్ట ముక్కలతో త్యాగరాజ స్వామి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. అందుకు సంబంధించి నమూనా చిత్రాన్ని వేశారు. అలాగే శ్రీ భగవద్రామానుజుల సహస్రాబ్ది ఉత్సవాల సమయంలో రామానుజుల విగ్రహాన్ని 30 కిలోల అట్టను వినియోగించి బంగారు విగ్రహంలా రూపొందించారు.శిల్పకళ ప్రావీణ్యంతో అట్టముక్కలతో అద్భుత కళాఖండాలు తయారు చేయటంతో 2020లో నరసింహన్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. 2021లో ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

- నెల్లూరు, హరనాథపురం, (ఆంధ్రజ్యోతి)

త్యాగరాజస్వామి విగ్రహంపై దృష్టి పెట్టా



చిన్నతనం నుంచి చిత్రకళపై ఆసక్తితో సొంతంగానే చిత్రకళను నేర్చుకున్నా. అట్టముక్కలతో దేవతా మూర్తుల విగ్రహాలు తయారు చేస్తున్నా. శ్రీవేంకటేశ్వరస్వామి దయతో ఆ కళలో కూడా మంచి ప్రావీణ్యం సాధించా. త్యాగరాజస్మరణోత్సవ సభను దృష్టిలో పెట్టుకుని అట్టముక్కలతో త్యాగరాజస్వామి విగ్రహం తయారీపై దృష్టి సారించా. ఇందుకు సంబంధించి చిత్రాన్ని రూపొందించుకున్నా.

- కిడాంబి నరసింహన్, చిత్రకారుడు, శిల్పి

అర్బన్ తహసీల్దారు కార్యాలయం



రాజసాన్ని ఒలికించే కలెక్టరేట్

ఆంగ్లేయుల కాలంనాటి జ్ఞాపకాలను పదిలం చేసుకున్న పాత ఎస్పీ కార్యాలయం

చెక్కు చెదరని తహసీల్దారు కార్యాలయం

ఇప్పటికీ పటిష్టంగా ఉన్న కలెక్టర్ కార్యాలయ భవనం లోపలి భాగం




బ్రిటీషర్ల నిర్మాణ శైలికి నిదర్శనం ఏబీఎం బిల్డింగ్


అలనాటి కట్టడాలకు తార్కాణంగా పాత ఎస్పీ ఆఫీసు


నేటికీ తరగని ప్రాచీన సంపద

నెల్లూరు నగరంలో ఎన్నెన్నో పురాతన భవనాలు

అవి నిత్యం మనకు కనిపించే భవనాలే. శతాబ్దాల తరబడి నిత్యం వందలాదిమంది సందర్శించే భవంతులే. కానీ వాటిని ప్రజలు కలెక్టరేట్ అని, ఎస్పీ ఆఫీసు అని, తహసీల్దార్ కార్యాలయమనే దృష్టితోనే చూశారు తప్ప... హుందాగా, పటిష్టంగా నిలబడిన అలనాటి కట్టడాల వెనుక దాగున్న సౌందర్యాన్ని, శ్రమను గుర్తించలేదు. అవన్నీ మన ప్రాచీన సంపదనే దృష్టితో చూసేవారు చాలా తక్కువమందే. కార్యాలయాలన్న విషయాన్ని పక్కనపెట్టితే ఆ పురాతన కట్టడాలు మన ప్రాచీన సంపదకు చిహ్నాలు. 200 ఏళ్ల క్రితం మన పూర్వీకుల వృత్తి నైపుణ్యానికి తార్కాణాలు. అలనాటి శ్రమ సౌందర్యం ఎంత బలంగా ఉండేదో చాటిచెప్పే ఆనవాళ్లు. అవే నెల్లూరు నగరంలోని పురాతన భవనాలు.

● కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉనికిని పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కానీ దాని చరిత్రను మాత్రం నేటి తరానికి గుర్తు చేయాల్సిందే. సున్నపు పూత మధ్య నిగనిగలాడుతూ నిలబడ్డ ఎర్రటి ఇటుక రాళ్ల వయసెంతో చెప్పి తీరాల్సిందే. బ్రిటీష్‌కాలంలోనే నెల్లూరు జిల్లా ఏర్పడింది. తొలిరోజుల్లో సర్వేపల్లి కోటలో కలెక్టర్ కార్యాలయం నడిచేది. జిల్లా తొలికలెక్టర్ జేజే కాటన్‌గా చెబుతారు. ప్రజలు అప్పట్లో కలెక్టర్‌ను దొర అని పిలిచేవారు. 1906లో నెల్లూరు నగరంలో కలెక్టరేట్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. 1915 వరకు (అంటే తొమ్మిదేళ్ల కాలం) ఈ కట్టడం నిర్మాణాలు జరిగాయని చెబుతారు. 1915లో కలెక్టరేట్‌ను ప్రారంభించారు. తొలి కలెక్టర్ జేజే కాటన్ నుంచి ఇప్పటి వరకు 95 మంది కలెక్టర్లు ఈ భవనాన్ని కేంద్రంగా చేసుకొని పాలన సాగించారు. కలెక్టరేట్‌లోని పట్టిక ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న కలెక్టర్ ఓ. ఆనంద్ 96వ కలెక్టర్. ఈ భవనం నిర్మించి ఇప్పటికి 109 సంవత్సరాలు అవుతోంది. అయినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. గోడలకు పేర్చిన ఎర్ర ఇటుకల బలిమి ఏమాత్రం తగ్గలేదు.


జిల్లా ట్రెజరీ కార్యాలయం

● పాత ఎస్పీ ఆఫీసు

పాత ఎస్పీ కార్యాలయం నిర్మాణం కూడా 1905లోనే మొదలయ్యింది. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం సముద్ర తీరానికి అనుకుని ఉన్న విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలను ఏకకాలంలో నిర్మించాయి. బ్రిటీష్ హయాంలో ఎస్పీలను పోలీస్ చీఫ్‌గా పిలిచేవారు. 1956 నుంచి ఎస్పీలుగా వ్యవహరిస్తున్నారు. ఈ భవనానికి కలెక్టరేట్ భవనానికి ఉన్నంత వయసే ఉంది. అయినా కృంగి పోలేదు. ఒంగిపోలేదు. పట్టు కూడా సడలలేదు.

● అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఇది కూడా 1906 ప్రాంతంలోనే నిర్మాణం జరిగింది. బ్రిటీష్ కాలంలో ఇది తాలూకా కార్యాలయంగా ఉండేది. ఈ భవనానికి ఇప్పటికి శతాధిక వసంతాల వయసే. అయినా నేటికీ చెక్కు చెదరలేదు. నిర్వహణ లోపం కారణంగా భవనాల్లో అక్కడక్కడా సమస్యలు కనిపిస్తుండవచ్చునేమో కానీ, పటిష్టత విషయంలో నేటి ఉక్కు యుగానికి కన్నా అప్పటి సున్నం యుగమే బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే నెల్లూరు నగరంలో చాలా భవనాలే నాటి చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి.

-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

'రాళ్లపాడు'లో పెరుగుతున్న నీటిమట్టం

లింగసముద్రం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిప్రవాహం రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రాజెక్టులో నీటిమట్టం 16.2 అడుగులకు చేరింది. పాజెక్టు ఎగువన కురిసిన వర్షాలకు నీటిప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 900 కూసెక్కుల మేర నీరు వస్తుందని అధికారులు తెలిపారు. అయితే ఈనెల 22న మరో అల్పపీడనం ఏర్పడి, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాగా పూర్తిస్థాయి నీటిమట్టం 20 అడుగులు.

● గండిపాళెంలో 11.5 అడుగులకు...

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయంలో 11.5 అడుగులకు నీటిమట్టం చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి 220 క్యూసెక్కుల వరద ప్రవహం వస్తుందన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులు కాగా, ప్రస్తుతం 11.5 అడుగులకు నీరు చేరిందన్నారు.

● సోమశిలకు తగ్గిన వరద

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం 32,116 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఆదివారం సాయంత్రానికి 18,734 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 59.415 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 40 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● కండలేరులో 36.3టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు నీటి మట్టం 36.3టీఎంసీలకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేరకు నీటిమట్టం పెరిగింది. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 175 క్యూసెక్కులుగా ఉందని ఈఈ కట్ట తిరుమలయ్య తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలోని సాతానుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, విగ్రహాల ధ్యానాదివాసము భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన ప్రసాదం వితరణ గావించారు. శ్రీ సాంబశివ చారిటబల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పూనుగుంట రేవతి, పలువురు గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధ్యాన సాధనపై అవగాహన

వింజమూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యాపకాలను తగ్గించుకొని ఆధ్యాత్మికత పెంపొందించుకోవాలని పిరమిడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని శ్రీవేద వ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యాన సాధనపై అవగాహన కల్పించారు. ఈనెల 27వ తేదీన శ్రీకాళహస్తి సూపర్ గ్రాండ్ మాస్టర్ ముని బాబుస్వామి ఆత్మజ్ఞాన తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాకాహారం ప్రాముఖ్యతను గురించి నినాదాలు చేస్తూ కరపత్రాలు పంచుతూ వైశ్యబజార్, పిరమిడ్ నగర్, పోలేరమ్మగుడి బజార్, కుమ్మరి బజారుల మీదుగా మహాకరుణ - శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ దొరసాని, హేమలత, స్వరాజ్యం, రాజేశ్వరి, ధ్యానులు పాల్గొన్నారు.

స్టీఫెన్‌కుమార్‌కు సన్మానం



స్టీఫెన్‌కుమార్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో చిరు ఉద్యోగిగా పని చేస్తూ సమాజిక సేవలు చేస్తున్న ఎం.స్టీఫెన్ కుమార్‌ను ఆదివారం బిట్రగుంట రైల్వే క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు యాదవ్, సత్యనారాయణ చార్యులు, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు, అధ్యక్షుడు స్పర్జన్‌రాజ్, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న వెంకట్రామయ్య, డాక్టర్ శ్రీధర్

కావలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) స్థానిక తపాలాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యార్థులకు ఆదివారం దీన్‌దయాళ్ స్పర్శయోజన క్విజ్ పోటీలు నిర్వహించారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి రైటింగ్‌ప్యాడ్, పెన్‌ను చవేరా ఫర్నిచర్ అధినేత చెన్నా వెంకట్రామయ్య చేతుల మీదుగా అందచేశారు.

హైవే ప్రయాణమంటే హడల్

- శిథిలావస్థలో వంతెనలు
- భయాందోళనలో ప్రయాణికులు



భోగ్యంవారిపల్లి వద్ద ఇనుప చువ్వలు కనిపిస్తున్న వంతెన

వరికుంటపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి శివారున ఉన్న మండలాల్లో జాతీయ రహదారులపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ప్రధానంగా వరికుంటపాడు, దుత్తలూరు మండలాల మీదుగా సాగిన 565 జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆ మార్గంలోని పలు గ్రామాల రహదారి వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఎన్నో ఏళ్ల తరబడి నిర్మించిన ఆ వంతెనలు శిథిలావవస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహదారులు ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఉప్పువాగుపై నిర్మించిన వంతెన గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దుత్తలూరు మండలం తెడ్డుపాడు సమీపంలోని వంతెన పరిస్థితి సైతం అలాగే దాపురించింది. ప్రతినిత్యం ఆ మార్గంలో విజయవాడ, కడప, బెంగళూరు, నెల్లూరు, చెన్నై, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర ప్రాంతాలకు సైతం అధిక సంఖ్యలోనే ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు పరుగులు తీస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఆ వంతెన మరింతగా దెబ్బతిని ఇనుప చువ్వలు సైతం బయటకు కనిపిస్తూ కూలే దశకు చేరడంతో భారీ వాహనాల సంగతి అటుంచితే కనీసం ఆటోలు, మోటారుబైకులు వంటి చిన్నపాటి వాహనాల్లో వెళ్లాలంటేనే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. కాగా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉంటుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనలతో పాటు అధ్వానంగా మారిన జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

గండి పూడ్చివేత



ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు

కొండాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి గ్రామానికి చెందిన గండికట్ల చెరువుకు పడిన గండిని అధికారులు, రైతులు తాత్కాలికంగా పూడ్చారు. శనివారం గండిపడిన ప్రాంతంలో రింగు బండ్‌ను ఏర్పాటు చేయగా, ఆదివారం ఇసుక బస్తాలు వేసినట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ కుమార్ తెలిపారు. దీంతో చెరువు నుంచి నీరు వృథాగా పోకుండా కాపాడటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గండిని పూడ్చేందుకు సహకరించిన స్థానిక నాయకులు, ఆయకట్టు రైతులకు ఇరిగేషన్ అధికారులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధికి సూచికలు రహదారులు

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి సూచికలు రహదారులని, నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రహదారుల నిర్మాణం చేపడతామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నర్రవాడ, కొత్తపేట, దుత్తలూరు పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి రూ.1.47 కోట్ల ఉపాధి హామీ నిధులతో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతోందన్నారు. అందరం కలిసికట్టుగా పని చేసి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుదామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యానాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉండేలా గురవారెడ్డి, ఏపీడీ గాయత్రీ, ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, డీఈ మణికుమార్, ఏఈ రవీంద్రనాథ్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే ఇంటూరి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పందలపాడు, కోవూరు గ్రామాల్లో పల్లెపండుగ కార్య క్రమం చేపట్టారు. అందులో భాగంగా పందల పాడు పంచాయతీలో రూ.10.06 లక్షల నిధులు, కోవూరు పంచాయతీలో రూ.24.45 లక్షలతో నూతన సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా సాగర్ జలాలను త్వరలోనే అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రతన్ జ్యోతి, తహసీల్దారు ఇక్బాల్, టీడీపీ నాయకులు కూనం సుబ్బారెడ్డి, జీ మోషే, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని పందలపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గోగినేని శివరామయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శివరామయ్య మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దివ్యాంగులకు దుప్పట్లు, చికెన్ బిర్యానీ పంపిణీ చేస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

కావలిటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బందిపడ్డ ముసునూరు దివ్యాంగుల కాలనీలోని దివ్యాంగులకు హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, బిర్యానీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రూరల్ ఎస్సై బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయమన్నారు. దివ్యాంగుల ఇబ్బందులను దివ్యాంగుల హక్కుల వేదిక నేత మండవ వెంకట్రావు తన దృష్టికి తేవడంతో దాత గౌస్ బాషా సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు సయ్యద్ గనీ బాషా అన్నారు. ఈ కార్యక్రమంలో చూపూరు ప్రభయ్య, చాన్‌బాషా, కానిస్టేబుల్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పేకాట శిబిరాలు

- పట్టించుకోని పోలీసులు

ఉలవపాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. కృష్ణాపురం, బద్దిపూడి గ్రామాల మామిడి తోటల్లో నిర్వహిస్తూ పందెం రాయుళ్లకు సకల సౌకర్యాలు కల్పించి రోజుకి వేలకు వేలు నిర్వాహకులు గడిస్తున్నారు. కృష్ణాపురం నుంచి భీమవరం వెళ్లే రహదారి వెంట ఉన్న మామిడి తోటలోని కోళ్లఫారం వద్ద అదేగ్రామానికి చెందిన ఒక వ్యక్తి స్థానికులతో కలిసి పేకాట ఆడిస్తున్నాడని, బద్దిపూడి గ్రామంలో కూడా ఇళ్లమధ్యనే పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సింగరాయకొండ, గుడ్లూరు, కందుకూరు మండలాలకు చెందిన పేకాటరాయుళ్లు ఈ గ్రామాలకు వచ్చి పేకాట ఆడుతుంటారు. చుట్టూ మామిడి తోటలు పైగా ప్రధాన రహదారిలో కాపలాదారులను పెట్టి పోలీ సులు, కొత్త వ్యక్తులు అటువైపు వస్తే వెంటనే ఫోన్‌ల ద్వారా నిర్వాహకులకు సమాచారం ఇస్తుంటారు. కాగా, స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి


యూటీఎఫ్ నిరంతర పోరాటం



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

లింగసముద్రం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతిశర్మ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా ఆదివారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో మండల యూటీఎఫ్ సమావేశం ఆశాఖ సంఘం నాయకురాలు సరోజిని అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ క్రమశిక్షణ కలిగిన సంస్థ అని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతోందన్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు జి వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, అంకయ్యలతోపాటు, ప్రధానోపాధ్యాయులు యుమాదవరావు, సూర్యప్రకాశరావు, శ్రీనివాసరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు గొర్రెపాటి సాంబయ్య తన కుమారుని జ్ఞాపకార్థం ఉపాధ్యాయులకు బ్యాగులను అందజేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా వై రామచంద్రయ్య, అధ్యక్షుడిగా ఎస్ సూర్యనారాయణ, సహాధ్యక్షులుగా ఆర్ వెంకటకృష్ణ, ఎస్ శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా టి సుధాకర్‌రావు, కోశాధికారిగా కె మహేంద్రలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా దుర్గం అభివృద్ధికి కృషి



దుర్గం అందాలను చూపుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి దుర్గాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దుర్గం కొండల్లో పారే సెలయేళ్లు, దుమికే జలపాతాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. ఊటీని తలపిస్తున్న అందాలతోపాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అందులో భాగంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల దృష్టికి తీసుకువెళ్లి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు అందచేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా పార్టీలో చేరేందుకు మక్కువ చూపుతున్నారన్నారు. ఈనెల 30వ తేదీ వరకు సభ్యత్వ నమోదుకు గడువు ఉందని, కార్యకర్తలు లక్ష్యం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బాలసుబ్రహ్మణ్యం, వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలు అందేనా.?

- కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

జలదంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ పరికరాలకు మోకాలొడ్డింది. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇబ్బడిముబ్బడిగా వ్యవసాయ పరికరాలు అందజేసింది. వైసీపీ పాలనలో దాని ఊసే ఎత్తకపోవడంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారు. ఈక్రమంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతంలో రూ.1 లక్ష విలువైన రోటోవేటర్ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం రాయితీపై రూ.10వేలకే ఇచ్చేవారు. ఇతర సామాజిక వర్గాల రైతులకు 50శాతం రాయతీపై ఇచ్చేవారు. రూ.30వేల విలువైన 5హెచ్‌పీ ఓపెన్‌వెల్ విద్యుత్ మోటారు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, ఇతర వర్గాలకు 50శాతం రాయితీపై ఇచ్చేవారు. ఇలా ఆయిల్ ఇంజన్లు, పవర్‌స్ప్రేయర్లు, ట్రాక్టర్ నాగళ్లు, కేజీ వీల్స్, స్ప్రేయర్లు, మినుము, పెసర నూర్పిడి యంత్రాలు తదితర 50కిపైగా రకాల యంత్రాలు మెకనైజెడ్ పార్మింగ్ పథకం కింద కేంద్రప్రభుత్వం అందించే రాయితీకి రాష్ట్రప్రభుత్వం మ్యాచింగ్‌గ్రాంట్ అనుసంధానించి గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అందించారు. ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలి.

117 జీవోతోపాటు ప్రభుత్వ యాప్‌లను రద్దు చేయాలి

- అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

కావలిటౌన్, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష పూరితంగా ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయులపై భారం మోపిన యాప్‌లను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కోఆపరేటివ్ కాలనీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన అపస్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా జరగడంలేదని, పారదర్శంగా వ్యవహరించాలన్నారు. ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి జిల్లా పరిషత్ పాఠశాలలకు బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, వైసీపీ ప్రభుత్వంఉపాధ్యాయుల నగదు వేలకోట్లు దిగమింగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విధానంతోనే పెన్షన్లు ఇవ్వాలని, త్వరితగతిన డీఎస్సీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, గౌరవాధ్యక్షుడు రవికుమార్, మణికంఠచారి, మాల్యాద్రి, వెంకటరెడ్డి, రాధయ్య, సునీత, గూడల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో కూలిన గోడ



కావలిరూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కావలి పట్టణం వైకుంఠపురంలోని చేవూరివారి తోటలో ఆదివారం తెల్లవారుజామున కాసా వీరరాఘవులు ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఆమార్గంలో గోడ రాత్రి సమయంలో కూలడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మానవ మృగాన్ని శిక్షించాలి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బాలికపై పెట్రోలు పోసి తగులపెట్టిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని జిల్లా నూర్‌బాషా ముస్లిం (దూదేకుల) సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం నాయకులు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరు నగర అధ్యక్షుడు కే బాబర్‌ఖాన్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

గిరిజనులకు బియ్యం పంపిణీ

విడవలూరు, అక్టోబరు 20: మండల పరిధిలోని చౌకిచర్లలో చెరువు కట్ట కింద నివసిస్తున్న గిరిజనులకు గ్రామ మాజీ సర్పంచులు సమాది కృష్ణ వేణి, సమాది శ్రీనివాసులు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు సురేష్, విజయమ్మ, సుధీర్, అంకయ్య పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ విషయంలో ద్వంద్వ వైఖరి తగదు

- ఎస్ఎఫ్ఐ నేతల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కావలి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ విషయంలో ద్వంద వైఖరి అవలంబిస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు ఆదివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్ పాఠశాలల వద్దకు తమ సంఘం వెళ్లి ప్రశ్నించగా వారు తమకు విద్యాశాఖాధికారులు నిర్వహించుకోమని చెప్పారని, మధ్యలో మీదేమిటని ఎదురు ప్రశ్రించారన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడగా వర్షాలు కారణంగా ఇటీవల పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున ఆదివారం అనుమతిచ్చామని చెప్పారన్నారు. ప్రయివేట్ పాఠశాలలపై ఉన్న అభిమానం ప్రభుత్వ పాఠశాలలపై అధికారులకు ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చొరవతీసుకుని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అభిలాష్, ఉదయకుమార్, ఉపాధ్యక్షుడు సాయి, నేతలు అనిల్, అరుణ్, నిక్కీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తూర్పు రాజగోపురం ద్వారబంధం ప్రతిష్ఠ

బిట్రగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మాణంలో ఉన్న తూర్పు రాజగోపురం ద్వారబంధం ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం జరుగనునట్లు నిర్మాణదాత ఎం.సుకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం చేస్తున్నామన్నారు. శాస్త్రోక్తంగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



టిడ్కో గృహ సముదాయంలో రోడ్లపై నీటిని పరిశీలిస్తున్న నేతలు

కావలిటౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయాన్ని సీ పీఎం నాయకులు ఆదివారం సందర్శించి నివాసితుల సమస్యలు తెలుసుకున్నారు. సీపీ ఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు టిడ్కో గృహాల్లో నీరు చేరి నివాసితుల ఇబ్బందులు పడ్డారని, రోడ్లలో మోకాలు లోతు నీరు చేరి కాలు కిందపెట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శివారు ప్రాంతం కావడంతో పాములు రోడ్లపై వస్తున్నాయని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని నివాసితులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి టిడ్కో గృహాల్లోని సమస్యలు పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, కృష్ణయ్య, తిరుపాలు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న దువ్వూరు కాలువ వంతెన రక్షణ గోడ

సంగంలోని దువ్వూరు కాలువ రెండవ వంతెన వద్ద ఒక వైపు రక్షణ గోడ దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెనకు ఉత్తరం వైపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఈ వంతెన మీదగానే పాఠశాలకు వెళ్లాలి. రక్షణ గోడ శిథిలమై ప్రమాదకరంగా ఉండడంతో చిన్నారులను ఒంటరిగా వంతెన మీదుగా పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. -- సంగం (ఆంధ్రజ్యోతి)

ఏ క్షణంలో ఏం జరుగుతుందో...?



నెర్రెలు బారిన ఆలయ గాలిగోపురంపై కలశభాగం

ఉలవపాడులోని ప్రసిద్ధి గాంచిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం గాలి గోపురంపై ఉన్న కలశభాగం నెర్రెలుబారింది. సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం మీదుగా ప్రధాన రహదారి వెళుతుంది. నాలుగు అంతస్థుల ఎత్తున ఉన్న గాలిగోపురంపై రావిచెట్లు పెరగడంతో నెర్రెలు ఇచ్చింది. గోపురం కలశం విరిగిపడే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం పాదచారులు, వాహన దారులకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏక్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. - ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)

శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు!



ఆముదాలదిన్నెలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

మండలంలోని ఆముదాలదిన్నె, చౌదరిపాలెం గ్రామాల్లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ఇవి ఏక్షణమైనా కూలి పెనుప్రమాదం సభవించే అవకాశం ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆముదాలదిన్నె ఎస్టీకాలనీలో వాటర్ ట్యాంకు పైకప్పు కూలి అదే ట్యాంకులో పడిపోయింది. దీంతో వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారి ఎప్పుడు కూలుతుందోనని సమీప ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చౌదరిపాలెంలో నివాసాల మధ్య ట్యాంకు పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి)